వెచ్చని నేస్తాలు

కొద్ది రోజులుగా పెరుగుతున్న చలి

- ఉన్ని దుస్తులకు డిమాండ్
- పోలీస్ బ్యారెక్స్ వద్ద ప్రత్యేక దుకాణాలు

- 8వ పేజీలో



స్థూల ఆదాయంలో విశాఖపట్నం ఫస్ట్

రాష్ట్ర స్థూల ఆదాయం రూ.12,23,691 కోట్లు

అందులో జిల్లా వాటా రూ.1,11,964 కోట్లు

- ఘన వ్యర్థాల నిర్వహణలోనూ 98 శాతం రేటింగ్‌తో రాష్ట్రంలో మొదటి స్థానం
- నగరంలో కాలుష్య నియంత్రణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచన
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి
- నీటి కొరతను అధిగమించేందుకు ప్రాజెక్టులు చేపట్టాలి
- స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయంగా పది సూత్రాలతో కూటమి ప్రభుత్వం ప్రణాళిక



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఈ క్రమంలో 2047 నాటికి 15 శాతం అభివృద్ధి రేటు అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కోసం అన్ని జిల్లాలకు పది సూత్రాల ప్రణాళిక అందించారు. పేదరికం నిర్మూలన, ప్రజల భాగస్వామ్యంతో పీపీపీ ప్రాజెక్టులు, ఉపాధి కల్పన, యువతను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయడం, మానవ వనరులకు శిక్షణ, రవాణా వ్యయాలు, ఉత్పత్తి వ్యయం తగ్గింపు, సరైన ఉత్పత్తుల తయారీ, నీటి భద్రత, స్వచ్ఛ భారత్, అన్ని రంగాల్లో డీప్ టెక్నాలజీ వినియోగం పెంచాలనేది ప్రభుత్వ ఉద్దేశం. వీటిని అనుసరిస్తూ ప్రజలకు మెరుగైన జీవనం అందించాలనేది లక్ష్యం.

ఇప్పటివరకూ సాధించిన లక్ష్యాలు, చేయాల్సిన పనులపై ప్రభుత్వం నివేదిక విడుదల చేసింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం స్థూల ఆదాయంలో విశాఖపట్నం జిల్లా మొత్తం 26 జిల్లాల్లోను మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థూల ఆదాయం రూ.12,23,691 కోట్లు కాగా అందులో రూ. 1,11,964 కోట్లు సాధించి 9.15 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో ఎన్టీఆర్ జిల్లా ఉండగా దాని ఆదాయం రూ.69,123 కోట్లు కావడం గమనార్హం.

- విశాఖ జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.1,472.78 కోట్ల లక్ష్యం ఇవ్వగా, అందులో నవంబరు నాటికి 684.9 కోట్లు (46.53 శాతం) వచ్చింది.
- విద్యా సంస్థల్లో బోధన, ఫలితాలు, వాతావరణం ఆధారంగా స్టార్ రేటింగ్ ఇచ్చారు. విశాఖ జిల్లాలో 595 పాఠశాలలు ఉండగా మొదటి ర్యాంకు 203 పాఠశాలలకు, 2వ ర్యాంకు 338 పాఠశాలలకు, మూడో ర్యాంక్ 52 పాఠశాలలకు వచ్చింది. రెండింటికి జీరో ర్యాంకు వచ్చింది.
- కాలుష్య నియంత్రణ విషయంలో విశాఖపట్నం, విజయవాడల్లో మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. కాలుష్యం వెలువడే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించింది. విశాఖలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ అమలు చేయాల్సి ఉంది. గాలి కాలుష్యం, ఘన వ్యర్థాలు, మురుగునీరు నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాలు సరిగ్గా నిర్వహించాలని,సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించింది.
- ఉద్యాన పంటలు, పామాయిల్ పెంపకంలో విశాఖ జిల్లా చాలా అభివృద్ధి సాధించాల్సి ఉందని సూచించింది. ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాలని, పామాయిల్ పంటలో డ్రోన్లు, డీప్ టెక్నాలజీ వినియోగించాలని ఆదేశించింది.
- సంక్రాంతి పండుగ నాటికి పల్లె పండుగ పనులు పూర్తిచేయాలని సూచించింది. విశాఖ జిల్లాలో 147 మౌలిక వసతుల పనులు చేపట్టి 117 పూర్తిచేయగా, మిగిలినవి నెల రోజుల్లో పూర్తి కావాల్సి ఉందని పేర్కొంది. అలాగే పశువుల షెడ్ల కోసం చేపట్టిన 154 పనుల్లో 74 పూర్తి కావచ్చాయని, మిగిలినవి చేపట్టాలని

... మిగతా 6వ పేజీలో

వసతి గృహాలకు మహర్దశ

- జిల్లాలోని 18 సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు రూ.2.02 కోట్లు కేటాయింపు
- మౌలిక సదుపాయాల కల్పన, హాస్టల్ భవనాల మరమ్మతులకు వినియోగించాలని ప్రభుత్వం ఆదేశం



సీతమ్మధారలోని ఎస్సీ బాలుర వసతి గృహం

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పన, ఆధునికీకరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో గల 18 వసతి గృహాలకు రూ.2.27 కోట్లు కేటా యించింది. ఇందుకు సంబంధించి మంగళ వారం ప్రభుత్వం విడుదల చేసింది.

జిల్లాలోని ఎనిమిది ప్రీ, పది పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో పనులకు ఈ నిధులు మంజూరు చేసినట్టు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు తెలిపారు. నియోజకవర్గాల వారీగా చూస్తే..తూర్పు నియోజకవర్గంలో ఉన్న రెండు బాలుర వసతి గృహాలకు రూ.19.05 లక్షలు, పశ్చిమ నియో జకవర్గ పరిధిలోని ఒక బాలుర వసతి గృహానికి రూ.13.92 లక్షలు, ఉత్తర నియోజక వర్గ పరిధిలోని రెండు బాలుర వసతి గృహాలకు రూ.7.68 లక్షలు, దక్షిణ నియోజకవర్గ పరిధిలోని బాలికల వసతి గృహానికి రూ.15.41 లక్షలు, పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని బాలికల వసతి గృహానికి

... మిగతా 6వ పేజీలో

మధురవాడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

రుషికొండ బీచ్, గంభీరం జలాశయాల వద్ద వాటర్ స్పోర్ట్స్

- రుషికొండలో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ హ్యాబిటేట్ సెంటర్
- జాతీయ రహదారిని అనుసంధానిస్తూ వివిధ ప్రాంతాల్లో 15 రహదారుల నిర్మాణం
- అనకాపల్లి సమీపాన 7.68 ఎకరాల్లో హెల్త్ సిటీ
- వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు



సమావేశంలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంగళవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షత వహించగా, కమిషనర్ విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ నేరుగా, పట్టణ, పురపాలక శాఖ కార్యదర్శి కన్నబాబు, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు.

- మధురవాడలో 2.7 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిర్ణయించారు. దీనిని ఒలింపిక్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తారు.
- రుషికొండ బీచ్, గంభీరం రిజర్వాయర్ వద్ద యువత కోసం వాటర్ స్పోర్ట్స్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.
- పరవాడ విశాఖ ఫార్మా సిటీ, అచ్యుతాపురం ఆర్థిక మండలిలో పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరగడం, బాధితులను విశాఖకు తీసుకువచ్చేలోపు మరణిస్తుండడంతో అనకాపల్లిలోనే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం అవసరం ఉందని గుర్తించారు. ఇందుకోసం ఎర్ర చెరువు వద్ద 7.68 ఎకరాలలో హెల్త్ సిటీ నిర్మాణానికి ఆమోదం తెలిపారు.
- విశాఖపట్నం నుంచి భీమిలి వరకు తీర ప్రాంతం కోతకు గురికాకుండా రూ.200 కోట్లతో కోస్టల్ ఎరోజన్ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. దీనికి అయ్యే వ్యయాన్ని 90:10 నిష్పత్తిలో కేంద్రం, వీఎంఆర్‌డీఏ భరిస్తాయి.
- వీఎంఆర్‌డీఏలో కొత్తగా విలీనమైన 13 మండలాలకు మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి ఆమోదించారు.
- నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీలు, నెల్లిమర్ల గ్రామ పంచాయతీలో రహదారులు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులను రూ.9 కోట్లతో చేపట్టాలని తీర్మానించారు.
- అనకాపల్లి, తుమ్మపాల ప్రాంతాల్లో

... మిగతా 6వ పేజీలో

ఆస్పత్రి పేరుతో నాటకం

సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్‌లో మూడు దశాబ్దాల కిందట కారుచౌకగా భూమి తీసుకున్న వైనం

- ఇప్పుడు ఆ ప్రాంతంలో హాస్పిటల్ ఏర్పాటు లాభదాయకం కాదంటూ వాదన
- రెసిడెన్షియల్/ కమర్షియల్‌గా మార్చుకుంటామంటూ దరఖాస్తు
- ఆ ప్రాంతమంతా ఆస్పత్రులే
- వైసీపీ ప్రభుత్వ హయాంలో పరిశీలించకుండానే వీఎంఆర్‌డీఏ ఎన్‌ఓసీ
- నిబంధనలకు పూర్తిగా విరుద్ధం



ఆస్పత్రి కోసం తీసుకున్న స్థలంలో నిర్మించ తలపెట్టిన బహుళ అంతస్థుల భవనం నమూనా



ఆస్పత్రి కోసం స్థలం..

17 అంతస్థుల భవనం!

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆస్పత్రి కోసం ఇచ్చిన స్థలంలో బహుళ అంతస్థుల భవనం నిర్మించుకోవడానికి విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఆగమేఘాలపై అనుమతి ఇవ్వడంపై తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి.

సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్‌లో ప్రస్తుతం ఉన్న ఎస్ఆర్ఐ ఆస్పత్రితో పాటు ఆపక్కనే రాజీవన్ ఆస్పత్రికి కూడా 1988లో వుడా 4,374 గజాల స్థలాన్ని నామమాత్రపు ధర (గజం రూ.200 చొప్పున)కు కేటాయించింది. దాదాపుగా మూడు దశాబ్దాల తరువాత అక్కడ ఆస్పత్రి నిర్వహణ లాభదాయకం కాదని, దానిని రెసిడెన్షియల్/కమర్షియల్‌గా మార్చుకుంటామని దరఖాస్తు చేసుకుంటే కేవలం మూడు వారాల్లో వీఎంఆర్‌డీఏ ఎన్‌ఓసీ ఇచ్చేసింది. దీనిపై 'ఆస్పత్రి కోసం స్థలం...17 అంతస్థుల నిర్మాణం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. అధికారుల నిర్ణయాన్ని అన్ని వర్గాలూ తప్పుబట్టాయి. లేఅవుట్‌లో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలంలో ప్రజలందరికీ ఉపయోగపడే నిర్మాణం ఉండాలే తప్ప ఇలా సొంతంగా ఫ్లాట్లు నిర్మించుకోవడం నిబంధనలకు విరుద్ధమని అధికార వర్గాలే చెబుతున్నాయి. భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలో జీవీఎంసీ కూడా నిబంధనలు ఉల్లంఘించిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్త ఆస్పత్రులు వస్తున్నాయ్

సీతమ్మధార, నార్త్

... మిగతా 6వ పేజీలో

అస్త్ర శస్త్రాలతో సిద్ధం

నేడే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

- 46 అంశాలతో ప్రధాన ఎజెండా, 21 అంశాలతో అనుబంధ ఎజెండా
- వివాదాస్పద అంశాలను చేర్చిన అధికారులు
- వాటిపై పాలక పక్షాన్ని నిలదీయాలని కూటమి కార్పొరేటర్ల నిర్ణయం
- ముడసర్లోవ పార్కులో గుర్రాల ప్రాజెక్టుకు ముందస్తు అనుమతులు, టీడీఆర్ బాండ్‌లకు ప్రత్యామ్నాయంగా నగదు చెల్లింపు, తదితర అంశాలపై చర్చకు పట్టుబట్టాలని నిర్ణయం



విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సర్వసభ్య సమావేశం బుధవారం జరగనున్నది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చర్చించేందుకు 46 అంశాలతో ప్రధాన ఎజెండా, 21 అంశాలతో అనుబంధ ఎజెండా తయారుచేసి సభ్యులకు అందజేశారు. రెండింటిలోనూ కొన్ని వివాదాస్పద, జీవీఎంసీకి నష్టం కలిగించే అంశాలను చేర్చడంతో వాటిపై పాలక పక్షాన్ని నిలదీసేందుకు కూటమి కార్పొరేటర్లు సిద్ధమవుతున్నారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన కార్పొరేటర్లు సోమవారం షాడో సమావేశం ఏర్పాటుచేసుకున్నారు. ఈ సందర్భంగా రెండు ఎజెండాల్లో వివాదాస్పదమైన, జీవీఎంసీకి నష్టం కలిగించేలా ఉన్న అంశాలపై లోతుగా చర్చించారు. రోడ్ల నిర్మాణం/విస్తరణ కోసం భూమి సేకరిస్తే బాధితులకు ఇప్పటివరకూ పరిహారం కింద టీడీఆర్ బాండ్లు ఇస్తున్నారు. అలాకాకుండా ఒక రహదారి (ఎండాడ టు బీచ్‌రోడ్డు) విషయంలో నగదు పరిహారం ఇవ్వాలని ప్రతిపాదించడంపై కూటమి కార్పొరేటర్లు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. నగదు పరిహారంగా ఇవ్వడం మొదలెడితే జీవీఎంసీ ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది కాబట్టి ఆ ప్రతిపాదనను విరమించుకునేంత వరకూ పోరాటం చేయాలని నిర్ణయించారు. అలాగే నగరంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న క్లాప్ వాహనాలకు లోడర్లుగా 656 మందిని రోజువారీ వేతనంపై ఈ ఏడాది మార్చిలో కాంట్రాక్టర్ ద్వారా నియమించుకున్నారు. 65 రోజులు గడువు ముగిసిన తర్వాత కొత్తగా మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉన్నప్పటికీ గతంలో తీసుకున్న వారినే ఇప్పటికీ కొనసాగించడంతో పాటు వారికి వేతనాలు చెల్లించేందుకు ప్రతిపాదన తయారుచేసి ఎజెండాలో చేర్చడంపై కూడా కూటమి సభ్యులు మేయర్‌ను నిలదీసే అవకాశం ఉంది. అదేవిధంగా ముడసర్లోవ పార్కులో గుర్రాల ప్రాజెక్టుకు మేయర్ ముందస్తు అనుమతులు ఇవ్వడం, ఇప్పటికే సగం బిల్లు కాంట్రాక్టర్‌కు చెల్లించడంపై కూడా కూటమి కార్పొరేటర్లు నిలదీసే అవకాశం ఉంది. కూటమి కార్పొరేటర్ల దాడిని తిప్పికొట్టేందుకు కౌన్సిల్‌లో పాలక పక్షమైన వైసీపీ కూడా కార్పొరేటర్లతో షాడో మీటింగ్ నిర్వహించింది. కూటమి కార్పొరేటర్లు ఏప

... మిగతా 6వ పేజీలో



18న సర్వే నౌక 'ఐఎన్ఎస్ నిర్దేశక్' జలప్రవేశం

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో హైడ్రోగ్రఫిక్ సర్వేల నిర్వహణకు, నేవిగేషన్ సహకారం కోసం కొత్తగా నిర్మించిన సర్వే నౌక 'ఐఎన్ఎస్ నిర్దేశక్'ను ఈ నెల 18న జల ప్రవేశం చేయించనున్నారు. విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో నిర్వహించే ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్ వస్తున్నారు. సర్వే నౌకల తయారీకి చేపట్టిన భారీ ప్రాజెక్టులో ఇది రెండోది. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు. 110 మీటర్ల పొడవుతో, 3,800 టన్నుల బరువును తీసుకుపోయే సామర్థ్యం కలిగిన ఈ నౌక రెండు డీజిల్ ఇంజన్ల సహకారంతో నడుస్తుంది. హైడ్రోగ్రఫిక్, ఓషనోగ్రఫీ సర్వేకు సంబంధించిన అత్యాధునిక పరికరాలు ఇందులో అమర్చారు. గతంలో ఇదే పేరుతో నడిపిన నౌక 32 ఏళ్ల పాటు నేవీకి సేవలు అందించింది. 2014 డిసెంబరు 19న డీ కమిషనింగ్ చేశారు. ఆ స్థానంలో ఆధునిక పరిజ్ఞానంతో దీనిని నిర్మించారు. గంటకు 18 నాటికల్ మైళ్ల వేగంతో వెళ్లే ఈ నౌక సముద్రంలో ఏకధాటిగా 25 రోజులు ప్రయాణిస్తుంది.



నెట్ లేకుండానే చెత్తను లారీలో తరలిస్తున్న వైనం

చెత్త తరలింపులో నిర్లక్ష్యం

- గాలికి ఎగిరి వెనుక వాహనాలపై పడుతున్నా పట్టించుకోని సిబ్బంది
- ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్న నగరవాసులు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలింపు సమయంలో వాహనాల సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ చెత్త వెనుకవచ్చే బైక్‌లు, ఇతర వాహనాలపై పడుతోంది. ఈ కారణంగా ఒక్కోసారి వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. నగరంలో ఉత్పత్తి అయిన చెత్తను తొలుత జోన్‌ల వారీగా ఏర్పాటుచేసిన ఎంఎస్ఎఫ్‌లకు తరలించి నిల్వ చేస్తారు. అక్కడి నుంచి లారీల్లో కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. అలా తరలించేటప్పుడు చెత్త గాలికి ఎగిరి రోడ్డుపై పడకుండా నెట్ ఏర్పాటుచేయాలి. కానీ వాహనాల డ్రైవర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెట్ గానీ, టార్పాలిన్ గానీ లేకుండానే కాపులుప్పాడ యార్డుకు తరలిస్తున్నారు. ఈ విధంగానే మంగళవారం రాత్రి నెట్ లేకుండా ఒక లారీ చెత్తను జాతీయ రహదారి మీదుగా కాపులుప్పాడ తరలించింది. ఆ సమయంలో చెత్త గాల్లోకి ఎగిరి వెనుకవచ్చే వాహనాలపై పడింది. ఖాళీ కొబ్బరి బొండాలు జారి రోడ్డుపై పడడంతో ఒక ద్విచక్ర వాహనదారుడు గాయాలపాలయ్యాడు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి..చెత్త తరలించేటపుడు తగిన జాగ్రత్తలు పాటించేలా ఆదేశాలివ్వాలని నగరవాసులు కోరుతున్నారు.

7వ వార్డులో రెవెన్యూ సదస్సు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మధురవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠాల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులతో పాటు ఇంటి పన్నులకు అవకాశం కల్పించాలని జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని మధురవాడ, పిలకవానిపాలెం, చంద్రంపాలెం, మల్లయ్యపాలెం, నగరంపాలెం తదితర ప్రాంతాల వాసులు రెవెన్యూ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక వాంబే కాలనీ కల్యాణ మండపంలో విశాఖ గ్రామీణ మండలం తహశీల్దార్ పాల్‌కిరణ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతిన నాయుడు, కానూరు అచ్యుతరావు, మామిడి దుర్గారావు, పిళ్లా రాము తదితరులు పలు భూసమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందించారు. గ్రామకంఠాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడంతో స్థలాలు ఉన్నా ఇళ్ళు నిర్మించుకోలేకపోతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే ఉన్న కొన్ని ఇళ్లకు కూడా ఇంటిపన్నులు వేయకపోవడంతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పోతిన నాయుడు తదితరులు తహశీల్దార్‌కు తెలిపారు. మధురవాడలోని ఆదిత్యనగర్‌లో రహదారికి అడ్డంగా ఒక వ్యక్తి గోడను నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, ఇదే విషయాన్ని గతంలో సిట్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం కనిపించలేదని పిళ్లారాము, మామిడి దుర్గారావు, పిళ్లా శివసత్యనారాయణ, కానూరి అచ్యుతరావు తదితరులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా తహశీల్దార్ పాల్‌కిరణ్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించామని, వీటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

95 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): భీమిలి మండలం అన్నవరం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 95 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. భీమిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా.కల్యాణి ఆధ్వర్యంలో ఈ పరీక్షలు చేపట్టారు. పైలపేట, ఎర్రయ్యపాలెం, పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వీరికి తరచూ వచ్చే ఆరోగ్య సమస్యలపై వైద్యులు డా.రవీంద్ర అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో పాల్గొన్న పాఠశాలలకు ప్రథమ చికిత్స కిట్లును దివీస్ అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు స్వాతి, భాస్కర్, సర్వేశ్వరరావు దివీస్ ప్రతినిధులు సురేష్, నర్సింహ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

మధురవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలితా త్రిపుర సుందరీసమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవాయిద్యాలు, పురోహితుల మంత్రోచ్చారణతో స్వామి, అమ్మవార్ల కల్యాణం కనులపండువగా జరిపించారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కమనీయంగా జరిగింది. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నడక వంతెనకు పచ్చజెండా!

▸ గత ఒప్పందం రద్దు..
జీవీఎంసీ నిధులతో నిర్మాణం



మధురవాడలో నిర్మించబోయే నడక వంతెన నమూనా



చంద్రంపాలెం పాఠశాల

మధురవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మధురవాడ ప్రజల ఆకాంక్ష నెరవేరబోతోంది.. చంద్రంపాలెం హైస్కూలు విద్యార్థుల సౌకర్యం కోసం జాతీయ రహదారిపై నిర్మించడానికి గత ప్రభుత్వంలో ఒక ప్రైవేటు సంస్థతో జరిగిన ఒప్పందం రద్దయింది. తాజాగా.. ఈ నిర్మాణాన్ని స్వయంగా జీవీఎంసీయే చేపట్టేందుకు ముందడుగు పడుతోంది. సుమారు 4000 మంది విద్యార్థులు ఉన్న చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల జాతీయరహదారికి ఆనుకొనిఉండడంతో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ప్రజా ప్రతినిధులు , అధికారులు స్పందించారు. ఇటీవల చంద్రంపాలెం పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ సందర్శించినపుడు భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్లు నడక వంతెన నిర్మాణ అవసరం గురించి ఆయనతో మాట్లాడారు. ఎట్టకేలకు నడక వంతెన నిర్మాణాన్ని జీవీఎంసీ రూ.3.23 కోట్లతో చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 11న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్లో ఈ అంశాన్ని పొందుపరచి అనంతరం పనులు చేపట్టనున్నట్టు సమాచారం.

గత ప్రతిపాదనలకు ఎన్‌హెచ్ఏ అభ్యంతరం..

గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావిడిగా ఒక ప్రైవేటు సంస్థతో నడక వంతెన పనులకు శంకుస్థాపన చేయించింది. ఈ వంతెన పై వాణిజ్య ప్రకటనలు ఉంటాయని.. వాహన చోదకులు దృష్టి ప్రకటనలపై పడి ప్రమాదాలు జరుగుతాయని భావించి జాతీయ రహదారుల శాఖ అనుమతి నిరాకరించింది.దీంతో ఈ ప్రతిపాదన అమలు కాలేదు. ఈ క్రమంలో నడక వంతెనను జీవీఎంసీ నిధులతోనే చేపట్టేందుకు జీవీఎంసీ కమిషనర్ ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన



రామవరం రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ఆనందపురం/ ఎండాడ, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి) : నలుగురు యువ సర్పంచ్‌లు పట్టుదలకు తన ప్రయత్నం తోడవడంతో రామవరం తారురోడ్డుకు మోక్షం కలిగిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన 1.6 లక్షలతో చేపట్టనున్న రామవరం రోడ్డు, అలాగే జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ రుషికొండ డబుల్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ బీచ్ రోడ్డుకి కనెక్టివిటీ రోడ్డు, ఎండాడ బీసీ కాలనీతో పాటు చుట్టు పక్కన లే అవుట్‌లకు రోడ్డు, రూ.7 కోట్లతో నిర్మించనున్న కల్వర్టులతో పాటు సామాజిక భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో జరగని రోడ్డు పనులు అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో ప్రారంభించామన్నారు. తనకు భారీ మెజార్టీతో గెలిపించారని, తప్పకుండా మీ అందరి ఆకాంక్షలు నెరవేర్చుతానన్నారు. ఆనందపురంలో తొందర్లోనే అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. అర్హులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని, చెరువుల వద్ద కల్వర్టుల నిర్మాణం చేసి రెండో పంటకు నీళ్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నీళ్లకుండీలు జంక్షన్ నుంచి రామవరం, భీమన్నదొరపాలెం మీదుగా గిడిజాల, కొత్తవలస రోడ్డు వరకూ పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే రూ.30 లక్షలతో రాజుగారి మామిడి తోట నుంచి రామవరం వరకు తారు రోడ్డు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. అలాగే రూ.87 లక్షలతో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను ఎమ్మెల్యే గంటా ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, సర్పంచ్‌లు యర్ర రాజు, జోన్-2 కమిషనరు ఫణిరామ్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

16వ పోలీస్ బెటాలియన్‌లో వార్షిక తనిఖీ



పోలీస్ పెరేడ్‌ను పరిశీలిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

కొమ్మాది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన బెటాలియన్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో దర్బార్ నిర్వహించారు. సిబ్బంది నుంచి కమాండెంట్ గౌరవవందనం స్వీకరించారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం, మురళీధర్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

2047 నాటికి వికసిత్ భారత్ : ఆచార్య అజిత్‌కుమార్

కొమ్మాది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ప్రజలంతా ప్రణాళికాబద్ధంగా ఒకే సంకల్పంతో పయనిస్తే 2047 సంవత్సరం నాటికి భారతదేశం వికసిత్ భారత్‌గా రూపొందుతుందని ఎన్జీవో వ్యవస్థాపకుడు, వీడీఎం-ఇండియా ఆన్ ద మూవ్ చైర్మన్ ఆచార్య అజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కొమ్మాదిలోని రిక్షా కాలనీలో గురుకుల ప్రతిభా బాలికల పాఠశాలలో నిర్వహించిన వికసిత్ భారత్-2047 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థినులు వ్యాసరచన పోటీలు నిర్వహించి పది మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త రూపవతి, ప్రిన్సిపాల్ డి.శాంతకుమారి పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో తిరునక్షత్ర పూజలు

సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం వేకువన సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులు, ఆళ్వార్లతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. శాస్త్రోక్తంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, షోడశోపచారాలు చేశారు. ఆలయ స్థానాచార్యులు డా.టి.పి. రాజగోపాల్ పర్యవేక్షణలో ఆలయ అధ్యాపకులు నాలాయిర దివ్యప్రబంధంలోని కొన్ని పాశురాలను వినిపించారు. మధ్యాహ్నం రాజభోగ నివేదనల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా బంగారమ్మ పండగ



రెడ్డిపల్లిలో బంగారమ్మకు పూజలు

పద్మనాభం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లిలో బంగారమ్మ తల్లి వారాల పండగ మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించడానికి ఊరి పండగకు ముందు నిర్వహించే ఈ ఉత్సవం సందర్భంగా గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని ఘటాలు ఉన్న ఆలయం నుంచి ఊరేగింపుగా బంగారమ్మ ఆలయానికి భక్తులు తరలివెళ్లి, అక్కడ అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు.

పచ్చదనాన్ని నాశనం చేయొద్దు: కార్పొరేటర్



దేవస్థానం డీఈతో కార్పొరేటర్ నరసింహం చర్చలు

సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.54.4 కోట్లు వెచ్చించి 'ప్రసాద్' పథకం పేరుతో సింహగిరిపై చేపడుతున్న అభివృద్ధి పనులతో పచ్చదనాన్ని నాశనం చేయొద్దని మహావిశాఖ 98వ వార్డు కార్పొరేటర్ పి.వి. నరసింహం దేవస్థానం అధికారులను కోరారు. సింహగిరిపై ఫలసాయం కోసం శిస్తులు చెల్లించిన కౌలు రైతుల అభ్యర్థన మేరకు మంగళవారం కార్పొరేటర్ పనులను పరిశీలించారు. కొండదిగువ రెండో ఘాట్‌రోడ్డుకు సమీపంలో చేపట్టే అభివృద్ధి పనుల కోసమని జీడి తోటలను అధిక విస్తీర్ణంలో నాశనం చేస్తున్నారని రైతులు మొరపెట్టుకున్నారు. దానిపై దేవస్థానం డీఈ డీవీఎస్ రామరాజు(హరి)తో కలిసి ఆయన క్షేత్ర పరిశీలన జరిపారు. తాత తండ్రుల నుంచి సింహగిరిపై చెట్లు పెంచి పెద్ద చేసిన రైతులకు అన్యాయం కలగటంతోపాటు పచ్చదనం, పర్యావరణానికి విఘాతం కలిగించేలా చెట్లను ధ్వంసం చేయొద్దని, నరకాల్సి వస్తే అంతే సంఖ్యలో నాటాలని కార్పొరేటర్ దేవస్థానం అధికారులకు సూచించారు.

'గీతం'లో 'పీఎంశ్రీ'



..సందేహాలను నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

సాగర్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు నిర్దేశించిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎమ్‌శ్రీ) కార్యక్రమాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి జవహర్ నవోదయ విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. గీతంలోని అధునాతన పరిశోధన శాలలను, కేన్సర్ బయాలజీ ప్రయోగశాల, మూర్తి ప్రయోగశాలలను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ ప్రసంగించారు. విద్యార్థులు సైన్స్‌లో సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ, ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. నూతన విద్యావిధానంలో భాగంగా ఈ కార్యక్రమం పాఠశాల విద్యావిధానాన్ని నూతన పంథాలోకి నడిపించగలదన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, భౌతిక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్పందన, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అస్త్రశస్త్రాలతో సిద్ధం

... 5వ పేజీ తరువాయి

అంశాలపై లోతుగా చర్చకు పట్టుబట్టే అవకాశం ఉందనేది గుర్తించి...వాటిపై వారి వాదనను సమర్థంగా తిప్పికొట్టేందుకు పూర్తి సమాచారంతో సన్నద్ధంగా ఉండాలని కొందరు కార్పొరేటర్లకు నాయకులు సూచించారు.

ఏది ఏమైనప్పటికీ బుధవారం నాటి కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరగడం ఖాయమని ఇరువర్గాల కార్పొరేటర్లు పేర్కొంటున్నారు.

వసతి గృహాలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

రూ.8.65 లక్షలు, గాజువాక నియోజకవర్గ పరిధిలోని రెండు బాలికల వసతి గృహాలకు రూ.20.09 లక్షలు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని ఐదు బాలుర, నాలుగు బాలికల వసతి గృహాలకు రూ.117.99 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా వసతి గృహాల భవనాలకు మరమ్మతు లు చేయనున్నారు. అలాగే తాగు నీరు, డ్రైనేజీ, టాయ్‌లెట్లు, ఫ్లోరింగ్, మస్కిటో నెట్స్ ఏర్పాటు వంటివాటికి ఆ నిధులు వినియోగించనున్నట్టు డిప్యూటీ డైరెక్టర్ రామారావు వెల్లడించారు. కొద్దిరోజుల్లోనే పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు.

మధురవాడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

... 5వ పేజీ తరువాయి

అక్కడి అవసరాలకు తగినట్టుగా రూ.2.68 కోట్లతో కమర్షియల్, కన్వెన్షన్ సెంటర్లు నిర్మించాలని నిర్ణయించారు.

- భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ వివిధ ప్రాంతాల్లో 15 రహదారుల నిర్మాణానికి ఆమోదించారు. వీటికి అవసరమైన నిధులను చినముషిడివాడ, తుమ్మపాలలో వీఎంఆర్‌డీఏ భూముల అమ్మకం ద్వారా సమకూర్చుకోవాలని తీర్మానించారు.
- విశాఖపట్నం సెంట్రల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటెన్‌ను 40 నెలలు నిర్వహించడానికి రూ.1.84 కోట్లతో అంచనాలకు ఆమోదం తెలిపారు.
- రుషికొండలో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఢిల్లీ తరహాలో అర్బన్ హ్యాబిటేట్ సెంటర్‌ను పీపీపీ విధానంలో నిర్మించాలని తీర్మానించారు.

ఆస్పత్రి పేరుతో నాటకం

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌టెన్షన్ ఏరియా అంతా ఇప్పుడు ఆస్పత్రుల జోన్‌గా మారిపోయింది. ఎన్ఆర్ఐ ఆస్పత్రికి కేవలం కిలోమీటరు పరిధిలోనే పదికి పైగా ఆస్పత్రులు, మెడికల్ లేబొరేటరీలు, డ్రగ్ స్టోర్స్ ఉన్నాయి. ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఎదురుగానే ఈఎన్‌టీ వైద్యుల క్లినిక్ ఉంది. రాజీవన్ ఆస్పత్రి స్థలం ఎదురుగా మరో రెండు డెంటల్ క్లినిక్‌లు ఉన్నాయి. విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఉంది. అటు సీతమ్మధార డౌన్‌లోకి వెళితే నిఖిత ఆస్పత్రి, అల్లూరి విగ్రహం పక్కనే మూడు ఆస్పత్రులు, నాలుగు మందుల దుకాణాలు ఉన్నాయి. అందరికీ ఆస్పత్రుల నిర్వహణ లాభదాయకంగా ఉండగా, వారికి లేదని చెప్పడం పూర్తిగా వాస్తవ దూరం. అసలు ఆస్పత్రి నిర్మించకుండా వ్యాపారం లేదని చెప్పడం మరో విశేషం. ఎన్‌ఓసీ కోసం వారు పెట్టుకున్న దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఉంటే వీఎంఆర్‌డీఏ అధికారులు బహుళ అంతస్థుల భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చేవారు కాదు. ఆ సంస్థ నిర్వాహకులకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ఎన్‌ఓసీ ఇచ్చారని, అది నిబంధనలకు విరుద్ధమని అధికారులు చెబుతున్నారు.

కమిషనర్ దృష్టికి కూడా తీసుకువెళ్లలేదు

ఇలా భూ వినియోగ మార్పిడికి సంబంధించిన దరఖాస్తు వస్తే దానిని ప్రాసెస్ చేసి సంస్థ ఉన్నతాధికారి అయిన కమిషనర్‌కు పంపాలి. దానిని ఆయన పరిశీలించి, నోట్ రాసి ప్రభుత్వ పరిశీలనకు పంపాలి. ఇదీ నిబంధన. కానీ ఈ స్థలం విషయంలో అప్పటి సెక్రటరీగా పనిచేసిన అధికారి తానే నిర్ణయం తీసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం స్టాండింగ్ కౌన్సిల్ సిఫారసుతో ఎన్‌ఓసీ ఇచ్చేశారు. ఇలాంటి విషయాల్లో స్టాండింగ్ కౌన్సిల్ సిఫారసు పరిగణనలోకి తీసుకోకూడదని వీఎంఆర్‌డీఏ ఉన్నతాధికారి ఒకరు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ వ్యవహారంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, ఆ విషయం సంస్థ నివేదిక వెల్లడిస్తుందని వివరించారు.



నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్త

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించరేం?

నమ్మివానిపేట వద్ద పేరుకుపోతున్న వ్యర్థాలు

తగరపువలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ రెండో వార్డు పరిధి నమ్మివానిపేటలో ఏర్పాటు చేసిన 10 ఎకరాల డంపింగ్ యార్డులో నాలుగు వార్డులకు చెందిన చెత్తను కుప్పలుగా సేకరిస్తున్నారు. జీవీఎంసీ సమకూర్చిన ప్రత్యేక వాహనాల ద్వారా రోజూ పది టన్నులకు పైగా తడి, పొడి చెత్తను సేకరించి ఇందులో కుప్పలుగా పోస్తుంటారు. ఈ చెత్తను రెండు, మూడురోజులకొకసారి తగలబెట్టాలి. సాధారణ చెత్తతో సేకరించిన తడి చెత్తను ఈ ప్రాంగణంలో ఉన్న కంపోస్టు యార్డుకు తరలించాలి. దీనిని ఈ సమీపంలో ఉన్న యార్డులో నిల్వ చేస్తున్నారు. గతంలో ఈ యార్డు ఉన్న నమ్మివానిపేట వద్ద నివాసగృహాలు ఉండేవి కాదు. ఇటీవల కాలంలో అనేక గృహాలు, కాలనీలు పెరిగిపోయాయి. సమీపంలో ఎడదాసరిపేట, సంగివలస, నమ్మివానికల్లాలు వంటి ప్రాంతాలలో అనేక కాలనీలు వెలియడంతో జీవీఎంసీ సిబ్బంది తగులబెడుతున్న చెత్త నుంచి వస్తున్న పొగ వల్ల ఈ పరిసర ప్రాంతాల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకోసారి వారం, పదిరోజులకు కూడా ఈ చెత్తను కాల్చడం లేదు. చెత్తకు పెట్టిన మంటలు వల్ల రాత్రి పగలు ఈ యార్డు నుంచి పొగలు వ్యాపించి ఈ పరిసర ప్రాంతాలను కమ్ముకుంటున్నాయని అంటున్నారు. దీనిని అనుకుని సమీపంలో ఉంటున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి నిల్వ చెత్తను తగలబెడితే ఎలాంటి ఇబ్బంది ఉండదని అంటున్నారు. ముఖ్యంగా ఇక్కడికి వస్తున్న తడి చెత్తను వర్మీ కంపోస్టు తయారు చేయడానికి వినియోగించే ప్రక్రియను నిరంతరం చేపట్టాలని, దుర్గంధం రాకుండా చూడాలని కోరుతున్నారు. కాపులుప్పాడ వద్ద ఉన్న డంపింగ్‌యార్డుకు సమీపంలో ఎటువంటి నివాస గృహాలు లేవు. కానీ అక్కడివారు ఈ యార్డును తొలగించాలని కోరుతున్నారు. నమ్మివానిపేట వద్ద యార్డును ఆనుకుని అనేక గృహాలు ఉన్నాయి. దీనిని కూడా వేరే ప్రాంతానికి తరలించాలని వీరు ఆందోళన చేపట్టకముందే నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

క్రమశిక్షణ అలవరచుకోవాలి

సాగర్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రమశిక్షణ అలవరచుకోవాలని మాజీ సర్పంచ్ చెన్నాదాసు హితవు పలికారు. రుషికొండ వాడపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో దేవి సీఫుడ్స్ సహకారంతో విద్యార్థులకు అధ్యయన సామగ్రి (స్టడీ మెటీరియల్), మధ్యాహ్నభోజనం చేసేందుకు ప్లేట్లు, 200 గ్లాసులు, సుమారు రూ.2.5 లక్షల విలువైన వస్తువుల వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. దేవి సీఫుడ్స్ అధినేత పి.బ్రహ్మానంద, ఆయన సతీమణి పి.సూర్యవతి, కుమార్తె పి.రమాదేవి, ఎన్.నవీనల సహాయ సహకారాలతో పాఠశాల విద్యార్థుల పట్ల దాతృత్వం ప్రదర్శించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో వి.రమేష్, శ్రీనివాస్, శివరామకృష్ణ, పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు అన్నదానం

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):భీమిలి మండలం లక్ష్మీపురంలోని అయ్యప్పసేవా పీఠంలో మంగళవారం స్వాములకు ప్రత్యేక అన్నదానం ఏర్పాటు చేశారు. గురుస్వామి గాడు తాతినాయుడు ఆధ్వర్యంలో రోజూ ఒక్కో దాత ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మధురవాడకు చెందిన నాగేశ్వరరావు దంపతులు అందించిన విరాళంతో అన్నదానం చేశారు.

స్థూల ఆదాయంలో విశాఖపట్నం ఫస్ట్

... 5వ పేజీ తరువాయి

సూచించారు.

- విశాఖ జిల్లాకు రోజుకు 301.9 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం కాగా అందులో 264 మిలియన్ గ్యాలన్లు మాత్రమే అందుబాటులో ఉందని మిగిలిన నీటి కోసం చేపట్టిన పది ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది.
- విశాఖ జిల్లా ఘన వ్యర్థాల నిర్వహణలో 98 శాతం రేటింగ్‌తో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది.
- జిల్లాలో రహదారులపై మొత్తం 2,783 గుంతలు ఉండగా, వాటిలో ఇప్పటివరకూ 2,242 పూడ్చారని, ఇంకా 541 పూడ్చాల్సి ఉందని నివేదించారు.
- విశాఖ జిల్లాలో 2,43,669 మంది సమాచారం అందుబాటులో లేదని ప్రభుత్వం గుర్తించింది. కొంతమంది వివరాలుసేకరించారు. ఇంకా 98.87 శాతంమంది వివరాలు గుర్తించాల్సిఉంది.

☛ సంక్షిప్తంగా..

కన్నుల పండువగా శ్రీగీతా శోభాయాత్ర


శ్రీశోభాయాత్రలో కృష్ణార్జున వేషధారులు

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీ గీతా జయంతి పురస్కరించుకొని మంగళవారం శ్రీగీతా ప్రచార సమితి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీగీతా శోభాయాత్ర మంగళ ధ్వని వేదమంత్రాలతో కోలాటం శ్రీకృష్ణార్జున వేషధారణతో భగవన్నామ సంకీర్తనతో సిరిపురం పాండురంగాపురం డౌన్, కాళీమాత ఆలయం మీదుగా గోకుల్‌పార్కు వరకు జరిగింది. శ్రీగీతా శోభాయాత్రను శ్రీరామకృష్ణ మిషన్ స్వామిజీ శ్రీకృష్ణకానంద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు ఈ లోకానికి అందించిన ఉత్తమోత్తమైన గ్రంథం భగవద్గీత అన్నారు. గీతలో సారాంశాన్ని తెలుసుకొని అందరి జీవితాలను సార్థకత చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు చావలి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.జగన్‌మోహన్‌రావు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కార్యదర్శి ఎం.వనిజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, ఎస్.వాసుదేవరావు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

యుద్ధ నౌకలను సందర్శించిన ఆదివాసీ యువత

ఎండాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గిరిజన యువ సమ్మేళనానికి పాల్గొనేందుకు నగరానికి విచ్చేసిన ఆదివాసీ యువత మంగళవారం యుద్ధనౌకలను సందర్శించారు. తూర్పు నౌకాదళంలోని ఐఎన్ఎస్ సావిత్రితో పాటు మరో యుద్ధనౌకను తిలకించారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఐదు జిల్లాల నుంచి విచ్చేసిన ఆదివాసీ యువత నౌకలను చూసి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. అనంతరం హెచ్‌పీసీఎల్‌ని సందర్శించారు. హెచ్‌పీసీఎల్ హెచ్ఆర్ మేనేజర్ సుకిరియన్ ప్లాంట్ పనితీరును వారికి వివరించారు. సాయంత్రం సాగరతీరంలో ఐఎన్ఎస్ కురుసుర జలాంతర్గామి టీయూ- 143 యుద్ధ విమానం సీ వారియర్‌ను తిలకించారు. గీతం వేదికగా నిర్వహిస్తున్న యువసమ్మేళనంలో గిరిజన యువతను మంగళవారం ఫీల్డ్ వర్క్‌లో భాగంగా వీటిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ క్లబ్‌కు రెండు అవార్డులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ క్లబ్‌కు రెండు విభాగాల్లో అవార్డులు వచ్చాయి. ఇటీవల జరిగిన 101 గవర్నర్ సమావేశంలో ఈ అవార్డులను అందజేశారు. అల్వార్‌దాస్ మైదానంలో క్లబ్ క్లబ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌ను సభ్యులు అభినందించారు. ప్రతినెలా వాకర్స్ క్లబ్ సభ్యుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, మహాత్మా గాంధీ ఫౌండేషన్ సభ్యత్వాల నమోదు వంటి సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ఈ అవార్డులు అందుకున్నట్లు కిషోర్‌కుమార్ తెలిపారు.

సినిమా గైడ్

● **పుష్ప-2 :** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 26, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 68 దొండకాయలు 30, బంగాళ దుంపలు 33, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 20, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 44, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	618
విజయనగరం	622
శ్రీకాకుళం	622

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

ఇంత నిర్లక్ష్యమా?

▸▸ సంజీవ్‌గాంధీ కాలనీలో పాడైన మ్యాన్‌హోల్ ▸▸ నెలలు గడిచినా పట్టించుకోని అధికారులు


కనకదుర్గ ఆలయం మార్గంలో పాడైన మ్యాన్‌హోల్

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు బాగుంది కదా అని నిర్లక్ష్యంగా ఉంటూ మలుపు తిరిగితే అంతే సంగతులు... గోతులో పడి కాలువలో మునగడమే... ఇది 16వ వార్డులోని సంజీవ్ గాంధీ కాలనీ కనకదుర్గ ఆలయం మార్గంలో పరిస్థితి. ఈ మార్గంలో చివరన కాలువపై వేసిన మేన్‌హోల్ మూత విరిగి ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలల నుంచి ఇదే పరిస్థితి. ఇటు వైపు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. పెద్ద రోడ్డు కావడంతో ద్విచక్రవాహనం నుంచి భారీ వాహనాలు సైతం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే మ్యాన్‌హోల్‌పై మూత విరిగి సగం కాలువలోకి ఒరిగిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీనికి సమీపంలోనే రెండు సచివాలయాలు కూడా ఉన్నాయి. అధికారులు ఈ మార్గం వైపు పదేపదే తిరుగుతూనే ఉంటారు. అయినా దీన్ని బాగు చేసే దిక్కు లేదు. ఇప్పటికైనా సంబంధిత అదికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి ఏయూ మైదానంలోఆర్గానిక్ మేళా


ఆర్గానిక్ మేళా బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

మద్దిలపాలెం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 12 నుంచి నాలుగు రోజుల పాటు ఐదో ఆర్గానిక్ మేళా నిర్వహించానున్నామని గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా గోఆధారిత ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులను 300 స్టాల్స్ ద్వారా మేళాలో ప్రదర్శిస్తున్నామన్నారు. తొలిరోజు రైతు సమ్మేళనం, 13న మీ ఆరోగ్యం మీ చేతిలో, 14న ఫుడ్ ప్రాసెసింగ్, 15న మిద్దె తోటలపై సదస్సు ఉంటాయన్నారు.

గిరిజన పోడు వ్యవసాయోత్పత్తులు, సేంద్రియ విత్తనాలు, ఎరువులు, ఆర్గానిక్ వస్తువులు ప్రదర్శిస్తామన్నారు. మేళాను వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. మేళా పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జలగం కుమార్‌స్వామి, మధుసూదనరెడ్డి, ఉషా గణపతిరాజు, జేవీ రత్నం పాల్గొన్నారు.

భారత వారసత్వం, పురావస్తు శాస్త్రంపై ఉచిత ఆన్‌లైన్ కోర్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, వర్సిటీ అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఏయూ డీన్ వాన్ లేవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్‌తో కలిసి, భారతదేశ వారసత్వం ఐకనోగ్రఫీ, పురావస్తు శాస్త్రం అనే ఒక నెల రోజుల ఉచిత ఆన్‌లైన్ కోర్సును ప్రకటించింది. ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు అధికారిక కోర్సు పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు.

ఈ సందర్భంగా వీసీ భారతదేశ విస్తార, విభిన్నమైన చారిత్రక వారసత్వం ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రొఫెసర్ రావు మాట్లాడుతూ ఈ కోర్సులో ప్రపంచవ్యాప్తంగా ప్రవేశం పొందిన వారికి భారతదేశపు కళ, చిహ్నాలు, శిల్ప కౌశలం గురించి తెలుసుకోవడానికి ఒక అద్భుత అవకాశంగా ఉంటుందన్నారు. ఇది మన సాంస్కృతిక మూలలను అవగాహన చేసుకోవడంలో ముందడుగు అన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు మాట్లాడుతూ గ్లోబలైజ్ చేసిన ప్రపంచంలో ఈ రకమైన కోర్సుల ప్రాముఖ్యతను ప్రస్తావించారు. భారతదేశం సమృద్ధిగా ఉన్న చరిత్ర, సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రపంచానికి బోధించగలిగే పాఠాలు ఉన్నాయన్నారు. ఈ కోర్సు ఒక శాస్త్రీయ కఠినతను సులభమైన ఫార్మాట్‌తో కలుపుతూ విభిన్న ప్రేక్షకుల వరకు చేరుకుంటుందన్నారు. డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, డీన్ వాన్ లేవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కోర్సు విషయాన్ని వివరించారు. పాల్గొనే వారు పురాతన భారతదేశ వారసత్వంపై అవగాహన పొందుతారన్నారు. దీనిలో హిందూ దేవాలయ కళ, చిహ్నాలు, శిల్ప శైలుల వివరణ ఉంటుందన్నారు. కోర్సు భారతదేశపు పురావస్తు సైట్ల కొన్ని గుప్త అంశాలను కూడా అన్వేషిస్తుందన్నారు. మన చరిత్ర సమగ్ర అవగాహనను అందిస్తుందని చెప్పారు. ప్రపంచ అన్వేషకుడు, పురావస్తు శాస్త్రజ్ఞుడు ప్రవీణ్ మోహన్ ఈ ఆవిష్కరణ పట్ల తన ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తూ, భారతదేశం ప్రపంచంలోని కొన్ని అత్యంత రహస్య, ఆకర్షణీయమైన పురావస్తు సైట్ల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఇండిక్ ఐకానోగ్రఫీపై సదస్సు


ప్రవీణ్ మోహన్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చరిత్ర, పురాతత్వ శాఖ ప్రత్యేక ఉపన్యాసాన్ని మంగళవారం ఏయూలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత ప్రపంచ అన్వేషకుడు, ఐకానోగ్రఫీ నిపుణులు ప్రవీణ్ మోహన్ పాల్గొని ఇండిక్ ఐకానోగ్రఫీ అండ్ ఎక్స్‌ట్రా టెరెస్ట్రియల్స్ దేవతలు ఎలియన్లు కావా? అనే అంశంపై ఒక ఆలోచనాత్మక ఉపన్యాసం అందించా రు. హిందూ దేవతల ఆధిక్యాన్ని ఎక్స్‌ట్రా టెరెస్ట్రియల్ ప్రాణులుగా ప్రస్తావిస్తూ ఒక ఆసక్తికర సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఇవి భూమి మీద, ప్రత్యేకంగా భారతదేశంలో దూరం నుంచి వచ్చిన అదనపు సిద్ధాంతాలని పేర్కొన్నారు. బాలి, ఇండోనేషియా, గ్రీసు, ఈజిప్ట్ వంటి ఇతర సాంస్కృతిక ఐకానోగ్రఫీలతో పోల్చుతూ, ఆయన తన సిద్ధాంతానికి సంబంధించి దృశ్య ఆధారాలను సమర్పించారు. హిందూ దేవాలయాల ఆర్కిటెక్చర్, శాస్త్రీయ ప్రత్యేకతలపై కూడా దృష్టి పెట్టారు. తమిళనాడులోని సేలం దేవాలయాలు, ఆంధ్రప్రదేశ్‌లో గుడిమల్లా, శ్రీశైలంలోని దేవాలయాలను ఆయన ఉదాహరణలుగా తీసుకుని, ఈ దేవాలయాలు ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ ప్రాణుల ద్వారా అందించిన ఆధునిక జ్ఞానాన్ని సూచించే ప్రతిరూపాలుగా ఉంటాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారతదేశం ప్రత్యేక గమన శక్తి ఆధారిత భౌగోళిక స్థానమేమయితే ఈ ప్రాణుల దౌత్యాన్ని భారతదేశంలోకి తీసుకురావడానికి ప్రధాన స్థలంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మోహన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో మానవ హక్కుల దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. న్యాయ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనా ఏయూ విద్యార్థిని గీతాభార్గవి పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవాన్ని అంతర్జాతీయ సమాజం ప్రతి సంవత్సరం డిసెంబరు 10న నిర్వహించుకుంటుందని, 1948లో ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించిన రోజును గుర్తుచేసుకుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో లా టీచింగ్ సిబ్బంది, పలువురు న్యాయ విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

జర్నలిజం విభాగంలో...

ఏయూ జర్నలిజయం విభాగంలో హ్యూమన్ రైట్స్ పూర్వ విద్యార్థులు, పీపుల్స్ లిబరేషన్ వే వెల్ఫేర్ సొసైటీ, హెచ్ఆర్‌డీ విభాగం, డీడీసీడబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారవు, సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల ఆలయ వార్షికోత్సవం


అభిషేకాలు చేస్తున్న భక్తులు

సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహావిశాఖ 98వ వార్డు గోశాల లే అవుట్‌లోని సింహగిరి నిర్వాసితుల కాలనీలో కొలువుదీరి ఉన్న ఉమామహేశ్వరి పాదాలమ్మ, పుట్టబంగారమ్మ,బాలత్రిపురసుందరి అమ్మవార్ల నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు ప్రభాతారాధనలు పూర్తిచేశాక కాలనీకి చెందిన పలువురు ముత్తైదువలు పంచామృతాలతో అమ్మవార్లకు స్వయంగా అభిషేకాలు చేసి పసుపు కుంకుమలతో పూజ చేశారు. సాయంత్రం పూజారులు శాక్తేయాగమ శాస్త్ర విధానంలో ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


గాంధీనగర్-రవీంద్రనగర్ మార్గంలో రోడ్డు పక్కనే చెత్త గుట్ట

రోడ్ల పక్కనే చెత్తకుప్పలు

ఆరిలోవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు నుంచి గాంధీనగర్, రవీంద్రనగర్ వెళ్లే రోడ్డులో కల్వర్టు వద్ద చెత్త గుట్టలు పేరుకుపోయాయి. దీంతో ఈ ప్రాంతమంతా దుర్వాసన వెలువడుతోంది. ఈ కాలువలో పూడికలను వారం కిందట తీశారు. అయితే ఆ చెత్తాచెదారాన్ని కల్వర్టు వద్దే ఉంచేశారు. అప్పటి నుంచి తరలింపునకు చర్యలు తీసుకోలేదు. ఈ చెత్త ఎండకు ఎండి, వానకు తడుస్తుండడంతో దుర్వాసన వెలువడుతోంది. అంతేకాకుండా చెత్తను ఇలా కుప్పలుగా వేయడం వల్ల రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు, వాహనచోదకులు అంటున్నారు.ఈ సమస్యపై జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

▸▸ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు సుధాసాగర్


పాండ్రంగి రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పద్మనాభం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు, మండల రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి ఎస్.సుధాసాగర్ సూచించారు. మండలంలోని పాండ్రంగిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంగళవారం ఆయన ప్రసంగించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలు, రైతులు తమ భూ సంబంధమైన అన్ని రకాల సమస్యలపై వినతులు సమర్పిస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎలాంటి వివాదాలు లేని వాటిని అక్కడికక్కడే ఆన్‌లైన్ చేయించి పరిష్కరిస్తామన్నారు. ఈ సేవలకు ఎటువంటి రుసుము వసూలు చేయకుండా ఉచితంగానే సేవలు అందిస్తామన్నారు. ప్రజలు ఈసేవలను పొంది తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 54 వినతులు స్వీకరించారు. వీటిలో మ్యుటేషన్‌కు సంబంధించినవి 31. ఎఫ్ లైన్ సర్వే కోసం 14, దేవాదాయభూములు, 22ఏ కు సంబంధించి మూడేసి చొప్పున డిజిటల్ సంతకం, లేఅవుట్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఒక్కో దరఖాస్తు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె.ఆనందరావు, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టరు కనకబాబు, ఆర్ఐ శ్యామల పాల్గొన్నారు.

ప్రారంభానికి బంగారమ్మతల్లి ఆలయం సిద్ధం



సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి సహోదరిగా, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్యదేవత బంగారమ్మ తల్లి నూతన ఆలయం త్వరలో ప్రారంభానికి సిద్ధమైంది. కొన్ని దశాబ్దాల క్రితం నుంచి గ్రామదేవతగా పూజలందుకుంటున్న బంగారమ్మతల్లి పాత ఆలయం జీర్ణసితికి చేరడంతో పునర్నిర్మాణానికి సింహాచల దేవస్థానం నిర్ణయించింది. రూ.35 లక్షలతో నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టింది. సుమారు తొమ్మిది నెలల తరువాత నిర్మాణం దాదాపుగా పూర్తైంది. దక్షిణాయనంలో ఆలయాన్ని ప్రారంభించాల్సి ఉన్నందున ఈ నెల 15న ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది. ప్రారంభోత్సవ వేళ ప్రత్యేక యాగం చేసేందుకు వీలుగా ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశాల మేరకు ఈఈ బండారు రాంబాబు సారథ్యంలో యాగశాల వేగంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.

మిద్దె తోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదాం


కూరగాయల మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖను మిద్దె తోటల నగరంగా తీర్చిదిద్దుదామని జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అధికారి లక్ష్మి అన్నారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాల ఆవరణలో కూరగాయల మొక్కలు నాటిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటల మీద అందరికీ అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మిద్దె తోటలు అధికంగా పెంచాలన్న ఆలోచనతో ఇల్ల పైకప్పుమీద, ఇంటి పరిసరాల్లో బాల్కనీలు, విద్యా సంస్థల ఆవరణలో జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం, ఎస్ఆర్‌యూలతో కలసి కూరగాయల తోటలు అధికంగా పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు : వీఎంఆర్డీఏ చైర్మన్


ప్రణవ్ గోపాల్‌తో చర్చిస్తున్న సీతారాం

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు వీఎంఆర్డీఏ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో ఆయనతో ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కలిశారు. వీరు వీఎంఆర్డీఏ పరిధిలో బాలల హక్కులు, వారి సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. నిత్యం జన సామర్థ్యంతో ఉండే వివిధ ప్రాంతాల్లో బాల వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనక, పోక్సో చట్టంతో పాటు వివిధ బాలల చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కలిగించేలా హోర్డింగ్ బోర్డులను ఏర్పాటు చేసేందుకు వీఎంఆర్డీఏ పరంగా చర్యలు చేపట్టాలని సీతారం కోరారు.

ఘనంగా సీఆర్ రెడ్డి జయంతి


సర్ కట్టమంచి రామలింగారెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏయూ వ్యవస్థాపక ఉపకులపతి సర్ కట్టమంచి రామలింగ రెడ్డి జయంతిని మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏయూ ప్రధాన పరిపాలన భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగ రెడ్డి విగ్రహానికి ఉపకులపతి జి.శశిభూషణరావు, రెక్టార్ ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు పూలమాల వేసి అంజలి ఘటించారు. అలాగే స్నాతకోత్సవ మందిరం వద్దనున్న సీఆర్ రెడ్డి విగ్రహానికి సైతం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీఆర్ రెడ్డి ఆలోచనకు ప్రతిరూపంగా ఏయూ నిలుస్తుందన్నారు. వర్సిటీ ఏర్పాటు సమయంలో ఆయనకు అనేక సవాళ్లు ఎదురయ్యాయని, వాటిని ఆయన విజయవంతంగా ఎదుర్కొని ఒక గొప్ప ఆశయ సాధకునిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.నరసింహారెడ్డి, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, డాక్టర్ పద్మశ్రీ కె.ఈశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ తెలుగు శాఖలో...

ఏయూ తెలుగుశాఖలో ఏయూ తొలి ఉపకులపతి సర్ కట్టమంచి రామలింగారెడ్డి 144వ జయంతిని ఘనంగా జరిగాయి. ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యకర్మంలో ముందుగా సీఆర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ సీఆర్ రెడ్డి రావడం వలన దేశ విదేశాలలో పేరు ప్రఖ్యాతలు ఏయూకు వచ్చిందన్నారు. విజ్ఞానమే ప్రధానంగా వర్సిటీ నడిపిన ఘనత సీఆర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎ.నరసింహారెడ్డి, పలువురు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా ఏయూ ఫ్యాకల్టీ క్లబ్ ఆధ్వర్యంలో సీఆర్ రెడ్డి జయంతి నిర్వహించారు.



సర్ సీఆర్ రెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఆచార్యులు అప్పారావు, నరసింహారెడ్డి తదితరులు

ఐఏఎస్ఈ కళాశాలలో వ్యాసరచన పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఏయూ ఐఏఎస్ఈ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఐఏఎస్ఈ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నగరాజకుమారి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు బహూకరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కౌశల్ క్విజ్‌కు మనోజ్ ఎంపిక



మనోజ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూరోడ్డులో గల జీవీఎంసీ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి దాసరి మనోజ్ రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఇ.వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే క్విజ్‌కు ఎంపిక కాగా, అందులో తమ పాఠశాల నుంచి మనోజ్ ఉండడం ఆనందకర విషయమన్నారు. మనోజ్‌కు బహుమతిని అందించి అభినందించారు. విద్యార్థికి గైడ్ టీచరుగా వ్యవహరించిన అన్నారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

13న జిల్లా విలువిద్య జట్టు ఎంపిక పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా సబ్ జూనియర్ బాలుర, బాలికల విలువిద్య జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 13న సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఇండియన్ రౌండ్, కాంపౌండ్, రికర్వ్ ఈవెంట్లలో ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9 గంటలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.

పతాక నిధికి రూ.లక్ష విరాళం

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక నిధికి డాక్టర్ గిరి వర్మ రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం ఇందుకు సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు అందజేశారు.

15 వరకు పుస్తక ప్రదర్శన

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ఈ నెల 15 వరకు పొడిగించారు. టర్నర్ చౌల్ట్రీలో నిర్వహిస్తున్న 23వ పుస్తక మహోత్సవ ప్రదర్శన నగర ప్రజలకు, పుస్తక ప్రియులకు మంచి వేదికగా నిలిచింది. పుస్తక ప్రియుల కోరిక మేరకు 15 వరకు పొడిగించినట్లు మేనేజర్ రాజు తెలిపారు.

రుణయాప్ ఘటనలో యువకుడి ఆత్మహత్యపై కేసు నమోదు

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రుణ యాప్ నిర్వాహకుల వేధింపులు కారణంగా కొత్తగా పెళ్లయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అందిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం పోలీసు కమిషనరేట్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించటం, మహిళలను అవమానించటం, నేర పూరిత బెదిరింపులకు పాల్పడటం, లైంగిక అసభ్యకరమైన విషయాలను ప్రచురించటం వంటి నేరపూరిత సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితుడి మొబైల్ ఫోన్‌ను పరిశీలించి నిందితులను గుర్తించేందుకు సైబరు నిపుణుల బృందాన్ని నియమిస్తామన్నారు. ప్రాథమిక విచారణలో నేరస్థులు రాష్ట్రం వెలుపల నుంచి వచ్చినట్లు తెలుస్తోందని, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పంపిస్తామన్నారు.

'జాయ్ జమీమా తప్పు చేయలేదనడం దారుణం'

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాయ్ జమీమా ఏ తప్పు చేయలేదని కొందరు అనడం దారుణమని ఎన్ఆర్ఐ బాధితుడి తల్లి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాము చేసే బిజినెస్‌ను ప్రమోట్ చేస్తానంటూ వచ్చిందని, తన కుమారుడు చెప్పడంతో ఆమె మాటలు నమ్మానన్నారు. అనంతరం తన కుమారుడిని మచ్చిక చేసుకుని బిజినెస్‌ను అప్పజెప్పాలని ఒత్తిడి తెచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనకు, తన కుమారుడికి మధ్య మనస్పర్థలు పెంచిందని తెలిపారు. తనకు తెలియకుండానే అమెరికా నుంచి తన కుమారుడిని విశాఖకు రప్పించి హోటల్‌లో పెట్టి, మత్తు మందు కలిపి ఇచ్చిందని ఆరోపించారు. ఆమె పెట్టిన ఇబ్బందులను వాయిస్ మెసేజ్ ద్వారా తన కుమారుడు తెలియజేశాడన్నారు. వాస్తవాలిలా ఉంటే అమాయకురాలని వెనకేసుకురావడం ఏమిటని లక్ష్మి ప్రశ్నించారు.

విరిగిన విద్యుత్ స్తంభం తొలగించేదెప్పుడు?



ఫ్లైఓవర్‌పై పడి ఉన్న స్తంభం

జ్ఞానాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1న తుఫాన్ సమయంలో జ్ఞానాపురం ఫ్లైఓవర్‌పై విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 10 రోజులు గడుస్తున్నా జోన్-5 విద్యుత్ దీపాల విభాగ అధికారులు వాటిని తరలించలేదు. ఫుట్‌పాత్‌పై విడిచిపెట్టారు.వంతెనపై స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తుంటారు. స్తంభం అడ్డుగా ఉండడంతో నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి విరిగిన స్తంభాన్ని తరలించి కొత్త స్తంభం వేయాలని కోరుతున్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ అంతర కళాశాలల ఆటల పోటీల్లో శ్రీ కాశ్యప్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిగ్రీ విద్యార్థి శశిభూషణ్ కరాటేలో ప్రథమ స్థానంతోపాటు, యూనివర్సిటీ కబడ్డీ టీమ్‌లో ప్రాబబుల్స్‌లో స్థానం సంపాదించాడు. బాక్సర్‌గా బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ కళాశాల విద్యార్థుల బృందం ఏయూ స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జోత్స్నలు అభినందించారు.

భారీ ఎత్తున మహా ప్రసాదం తయారీ

» కనకమహాలక్ష్మి ఆలయంలో విక్రయానికి ఏర్పాట్లు » ఈవో ప్రత్యక్ష పర్యవేక్షణ » రేపు పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని అంచనా

జగదాంబ కూడలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం పెద్దసంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తారన్న అంచనాతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి మహా ప్రసాదం భక్తులకు ప్రీతికరం. అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులు గుడి వెలుపలకు వచ్చే ముందు వారి దృష్టి ప్రసాదాల కౌంటర్లపై పడుతుంది. అందులోనూ ఇక్కడి లడ్డూ, పులిహోర, చక్ర పొంగలిని భక్తులు చాలా ఇష్టపడతారు. రాకపోకలు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం, ఉచిత అన్న సమారాధన, ముఖ్యుల సందర్శన, మహిళలు, పిల్లల భద్రత ప్రధాన ఘట్టాలుగా తీసుకుని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సువాసనలు వెదజల్లే అమ్మవారి ప్రసాదమైన లడ్డూ, పులిహోర, చక్రపొంగలి రుచులు చూడాల్సిందే అన్నది భక్తుల ఆలోచన. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఉభయగోదావరి జిల్లాల నుంచి కనకమహాలక్ష్మి దర్శనం కోసం వేల సంఖ్యలో వస్తుంటారు. భక్తులకు అమ్మవారి ప్రసాదం అందలేదన్న నిరాశ ఉండకూడదనే ఉద్దేశంతో ఆలయ ఈవో కె.శోభారాణి వేల సంఖ్యలో లడ్డూ, పులిహోర, చక్రపొంగలి ప్యాకెట్లు తయారు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం ప్రసాద తయారీ చేస్తున్న వంట శాలలో స్వయంగా వాటి నాణ్యతను ఆమె పరిశీలించారు. ప్రసాదాల ప్యాకింగ్, తయారీ చేసిన లడ్డూలను, పులిహోర ప్యాకింగ్ ముందు ఉంచే పద్ధతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గురువారం 40 వేల వరకు లడ్డు ప్యాకెట్లు, 35 నుంచి 38 వేల పులిహోర పొట్లాలు, 35 వేల చక్రపొంగలి ప్యాకెట్లను భక్తులకు విక్రయించడానికి సిద్ధం చేయిస్తున్నారు. భక్తులు సులభంగా వాటిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం ఉద్యోగులు, అధికారులకు పనివిభజన బాధ్యతలు అప్పగించనున్నారు. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి.



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రసాదం తయారీని పర్యవేక్షిస్తున్న కార్యనిర్వహణాధికారిణి కె.శోభారాణి తదితరులు

సాధించుకున్నవాటి కోసం మళ్లీ పోరాడాలా?

» కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆక్షేపణ » బోనస్, వేతన సవరణ బకాయిల చెల్లింపునకు పోర్టు కార్మికుల డిమాండ్

జగదాంబ కూడలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోర్టు యాజమాన్యం నాలుగేళ్ల బోనస్ బకాయిలు చెల్లించాలని, వేతన సవరణ ఒప్పందాలు తక్షణం అమలు చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పోర్టు ఆథారిటీ చైర్మన్ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. సీఐటీయూ జాతీయ సమాఖ్య కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఒంటెత్తు పోకడల వల్ల కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని దుయ్యబట్టారు. పోర్టు ట్రస్ట్ ఈ ఏడాది రూ.725 కోట్ల లాభాలు ఆర్జించిందని, ఇందుకు కారణం కార్మికులే అన్నారు. పోరాడి వేతన ఒప్పందం సాధించుకున్నా అమలుకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వెనుక కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యధోరణే కారణమని విమర్శించారు. బోనస్ చెల్లింపుపై 2020-26 వరకు అంగీకారం కుదిరినా, కేంద్ర మంత్రివర్గం ఆమోదం లేనందున అడ్వాన్స్ చెల్లింపులు మాత్రమే జరిపారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం మంత్రివర్గం ఆమోదించి పూర్తి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూ ప్రధాన కార్యదర్శి మసేను మాట్లాడుతూ కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని విమర్శించారు. పోరాటాలతో సాధించుకున్న వేతన ఒప్పందం అమలుకు మళ్లీ పోరాడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల డిమాండ్లను తక్షణం అమలు చేయాలంటూ అన్ని ప్రధాన పోర్టు కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆందోళనలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులు కె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, మంగయ్యనాయుడు, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు చందు, బీఎంఎస్ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.



పోర్టు ఆథారిటీ చైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు

కళలతో మానసిక ఉల్లాసం



సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కళలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని పలువురు కళా రంగ ప్రముఖులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కేవీఆర్ స్వర సంగీత్ సంగీత్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ముందుగా కళా సంస్థల అధ్యక్షులు కొణతాల రాజు, జి.త్యాగరాజు, వీరేంద్రయాదవ్ జ్యోతి ప్రజల్వన చేశారు. గాయనీ గాయకులు 'ఇదేదో...గోలగా...ఏం..వానో తరుముతున్నది...రబ్బరు గాజులు' తదితర గీతాలను వీరేంద్రయాదవ్, స్వర్ణ, మహ్మద్‌ఖాన్, కోటేశ్వరరావు, బాలకృష్ణ, చెన్నా తిరుమలరావు శ్రావ్యంగా ఆలపించి సంగీత రస హృదయాలను కట్టిపడేశారు. ఈ సందర్భంగా వీరేంద్రయాదవ్ మాట్లాడుతూ సినీ సంగీతంపై చిన్నప్పటి కళలపై మక్కువతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెస్ మాధవ్, ప్రభాకర్, ఆశాలత, రాజు, చిరంజీవి, చంద్రకళ, ఆంజనేయరెడ్డి, రంజిత, శ్రీనివాస్, రాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రాంతాలకు నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొద్ది రోజులు పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 06081 నంబరు గల కొచువేలి-షాలిమార్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20 నుంచి జనవరి 24 వరకు ప్రతి శుక్రవారం, తిరుగు ప్రయాణంలోని 06082 నంబరు గల షాలిమార్-కొచువేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 23 నుంచి జనవరి 27 వరకు ప్రతి సోమవారం; 06087 నంబరు గల తిరునెల్వేలి-షాలిమార్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 19 నుంచి జనవరి 23 వరకు ప్రతి గురువారం, తిరుగు ప్రయాణంలో 06088 నంబరు గల షాలిమార్-తిరునెల్వేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 21 నుంచి జనవరి 25 వరకు ప్రతి శనివారం; 06055 నంబరు గల పొదనూర్-బరౌని ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 21 నుంచి జనవరి 25 వరకు ప్రతి శనివారం, తిరుగు ప్రయాణంలోని 06056 నంబరు గల బరౌని-పొదనూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 24 నుంచి జనవరి 28 వరకు ప్రతి మంగళవారం; 06095 నంబరు గల తంబరం-సంత్రాగచ్చి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 19 నుంచి జనవరి 23 వరకు ప్రతి గురువారం, తిరుగు ప్రయాణంలోని 06096 నంబరు గల సంత్రాగచ్చి-తంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20 నుంచి జనవరి 24 వరకు ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు బ్యారక్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు జరిగాయి. పురుషులు, మహిళల విభాగాల్లో చెస్, డిస్కస్ త్రో, రన్నింగ్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాధికారిణి జూన్ గ్యాలియట్, దఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు గొనుగొంట్ల కోటేశ్వరరావు, రామస్వామి, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ క్రీడాకారులు

'హక్కులను హరిస్తున్న మోదీ ప్రభుత్వం'

సీతంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆత్మ గౌరవంతో స్వేచ్ఛగా జీవించే హక్కు లేకుండా చేస్తుందని, మానవ హక్కులను హరిస్తోందని పలువురు వక్తలు ఆరోపించారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఇస్కఫ్, అంబేడ్కర్ మెమోరియాల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినం సందర్భంగా మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ దళితులు, మైనార్టీలపై దాడులతో హక్కులను కాలరాస్తూ మతోన్మాద రాజకీయానికి పాల్పడుతోందన్నారు. గిరిజన ప్రాంతాలను బలవంతంగా ఖాళీ చేయించి ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకించిన వారిని నక్సలైట్ల పేరుతో హత్యలు చేయిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందని, ఏమి తినాలో, ఏ దుస్తులు వేసుకోవాలో, ఎవరిని పూజించాలో కూడా వారే శాసిస్తున్నారన్నారు. ప్రధాని మోదీ మణిపూర్ వెళ్లేందుకు ఆసక్తి చూపించలేదన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి అవమానిస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు బొడ్డు కల్యాణరావు, రామప్రభు, ఉప్పల అప్పలరాజు, చిన్నారావు, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సొసైటీ ప్రతినిధులు, నిర్వాహకులు

వసతి గృహాలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

రూ.8.65 లక్షలు, గాజువాక నియోజకవర్గ పరిధిలోని రెండు బాలికల వసతి గృహాలకు రూ.20.09 లక్షలు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని ఐదు బాలురు, నాలుగు బాలికల వసతి గృహాలకు రూ.117.99 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఈ నిధులతో ఆయా వసతి గృహాల భవనాలకు మరమ్మతులు చేయనున్నారు. అలాగే తాగు నీరు, డ్రైనేజీ, టాయ్‌లెట్లు, ఫ్లోరింగ్, మస్కిటో నెట్స్ ఏర్పాటు వంటి వాటికి ఆ నిధులు వినియోగించనున్నట్టు డిప్యూటీ డైరెక్టర్ రామారావు వెల్లడించారు. కొద్దిరోజుల్లోనే పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు.

18 నుంచి జాతీయ వినియోగదారుల వారోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ అధికారి భాస్కరరావు

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై విషయ అవగాహనతో మోసాలు నిరోధించవచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కరరావు తెలిపారు. మంగళవారం పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం ప్రచార అంశంగా ఈ నెల 14 నుంచి 24 వరకు జిల్లాలో వినియోగదారులు వారోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. వినియోగదారుల సంఘాల సహకారంతో వారం రోజులు వినియోగదారుల హక్కుల రక్షణ బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో కె.వెంకటరమణ, పి. రమణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు తీరుపై కలెక్టర్ సమీక్ష

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 12 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో విజయవాడలో జరగనున్న కలెక్టర్ల సదస్సు నేపథ్యంలో మంగళవారం వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర, విశాఖపట్నం విజన్ ప్రణాళిక, జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల తీరుపైన సుదీర్ఘంగా చర్చించారు. తాజా పరిస్థితిని తెలుపుతూ నివేదికలు పొందుపరచాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పేరుతో నాటకం

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌టెన్షన్ ఏరియా అంతా ఇప్పుడు ఆస్పత్రుల జోన్‌గా మారిపోయింది. ఎన్ఆర్ఐ ఆస్పత్రికి కేవలం కిలోమీటరు పరిధిలోనే పదికి పైగా ఆస్పత్రులు, మెడికల్ లేబొరేటరీలు, డ్రగ్ స్టోర్స్ ఉన్నాయి. ఎస్ఆర్ఐ ఆస్పత్రి ఎదురుగానే ఈఎన్‌టీ వైద్యుల క్లినిక్ ఉంది. రాజీవన్ ఆస్పత్రి స్థలం ఎదురుగా మరో రెండు డెంటల్ క్లినిక్‌లు ఉన్నాయి. విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఉంది. అటు సీతమ్మధార జోన్‌లోకి వెళితే నిఖిత ఆస్పత్రి, అల్లూరి విగ్రహం పక్కనే మూడు ఆస్పత్రులు, నాలుగు మందుల దుకాణాలు ఉన్నాయి. అందరికీ ఆస్పత్రుల నిర్వహణ లాభదాయకంగా ఉండగా, వారికి లేదని చెప్పడం పూర్తిగా వాస్తవ దూరం. అసలు ఆస్పత్రి నిర్మించకుండా వ్యాపారం లేదని చెప్పడం మరో విశేషం. ఎన్‌ఓసీ కోసం వారు పెట్టుకున్న దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఉంటే వీఎంఆర్‌డీఏ అధికారులు బహుళ అంతస్థుల భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చేవారు కాదు. ఆ సంస్థ నిర్వాహకులకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ఎన్‌ఓసీ ఇచ్చారని, అది నిబంధనలకు విరుద్ధమని అధికారులు చెబుతున్నారు.

కమిషనర్ దృష్టికి కూడా తీసుకువెళ్లలేదు

ఇలా భూ వినియోగ మార్పిడికి సంబంధించిన దరఖాస్తు వస్తే దానిని ప్రాసెస్ చేసి సంస్థ ఉన్నతాధికారి అయిన కమిషనర్‌కు పంపాలి. దానిని ఆయన పరిశీలించి, నోట్ రాసి ప్రభుత్వ పరిశీలనకు పంపాలి. ఇదీ నిబంధన. కానీ ఈ స్థలం విషయంలో అప్పటి సెక్రటరీగా పనిచేసిన అధికారి తానే నిర్ణయం తీసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం స్టాండింగ్ కౌన్సిల్ సిఫారసుతో ఎన్‌ఓసీ ఇచ్చేశారు. ఇలాంటి విషయాల్లో స్టాండింగ్ కౌన్సిల్ సిఫారసు పరిగణనలోకి తీసుకోకూడదని వీఎంఆర్‌డీఏ ఉన్నతాధికారి ఒకరు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ వ్యవహారంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, ఆ విషయం సంస్థ నివేదిక వెల్లడిస్తుందని వివరించారు.

స్థూల ఆదాయంలో విశాఖపట్నం ఫస్ట్

... 5వ పేజీ తరువాయి

సూచించారు.

• విశాఖ జిల్లాకు రోజుకు 301.9 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం కాగా అందులో 264 మిలియన్ గ్యాలన్లు మాత్రమే అందుబాటులో ఉందని మిగిలిన నీటి కోసం చేపట్టిన పది ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది.

• విశాఖ జిల్లా ఘన వ్యర్థాల నిర్వహణలో 98 శాతం రేటింగ్‌తో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది.

• జిల్లాలో రహదారులపై మొత్తం 2,783 గుంతలు ఉండగా, వాటిలో ఇప్పటివరకూ 2,242 పూడ్చారని, ఇంకా 541 పూడ్చాల్సి ఉందని నివేదించారు.

• విశాఖ జిల్లాలో 2,43,669 మంది సమాచారం అందుబాటులో లేదని ప్రభుత్వం గుర్తించింది. కొంతమంది వివరాలు సేకరించారు. ఇంకా 98.87 శాతం మంది వివరాలు గుర్తించాల్సి ఉంది.

మధురవాడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

... 5వ పేజీ తరువాయి

అక్కడి అవసరాలకు తగినట్టుగా రూ.2.68 కోట్లతో కమర్షియల్, కన్వెన్షన్ సెంటర్లు నిర్మించాలని నిర్ణయించారు.

• భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ వివిధ ప్రాంతాల్లో 15 రహదారుల నిర్మాణానికి ఆమోదించారు. వీటికి అవసరమైన నిధులను చినముషిడివాడ, తుమ్మపాలలో వీఎంఆర్‌డీఏ భూముల అమ్మకం ద్వారా సమకూర్చుకోవాలని తీర్మానించారు.

• విశాఖపట్నం సెంట్రల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటెన్‌ను 40 నెలలు నిర్వహించడానికి రూ.1.84 కోట్లతో అంచనాలకు ఆమోదం తెలిపారు.

• రుషికొండలో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఢిల్లీ తరహాలో అర్బన్ హ్యాబిటేట్ సెంటర్‌ను పీపీపీ విధానంలో నిర్మించాలని తీర్మానించారు.

అస్త్రశస్త్రాలతో సిద్ధం

... 5వ పేజీ తరువాయి

అంశాలపై లోతుగా చర్చకు పట్టుబట్టే అవకాశం ఉందనేది గుర్తించి...వాటిపై వారి వాదనను సమర్థంగా తిప్పికొట్టేందుకు పూర్తి సమాచారంతో సన్నద్ధంగా ఉండాలని కొందరు కార్పొరేటర్లకు నాయకులు సూచించారు. ఏది ఏమైనప్పటికీ బుధవారం నాటి కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరగడం ఖాయమని ఇరువర్గాల కార్పొరేటర్లు పేర్కొంటున్నారు.

ఆగని మానవ హక్కుల ఉల్లంఘనలు

మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘన అనేక చోట్ల జరుగుతూనే ఉందని మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'అందరికీ స్వేచ్ఛ-అందరికీ సమానత్వం, న్యాయం' అనే అంశంపై మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఆయన ప్రసంగిస్తూ రాజ్యాంగం ప్రజలకు భావవ్యక్తీకరణ, నిరసన తెలిపే హక్కు కల్పించిందన్నారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టం చేసిందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జగన్‌మోహన్‌రావు, ప్రతినిధులు ఎస్వీ రమణ, సోమసుందరరావు, మల్లేశ్వరరావు, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో మంగళవారం మానవ హక్కుల చైతన్య ర్యాలీ జరిగింది. మానవ హక్కుల ప్రాముఖ్యతను తెలిపేవిధంగా రూపొందించిన స్కిట్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేంద్రీయ విద్యాలయంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

☛ సంక్షిప్తంగా..

కన్నుల పండువగా శ్రీగీతా శోభాయాత్ర



శ్రీశోభాయాత్రలో కృష్ణార్జున వేషధారులు

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీ గీతా జయంతి పురస్కరించుకొని మంగళవారం శ్రీగీతా ప్రచార సమితి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీగీతా శోభాయాత్ర మంగళధ్వని వేదమంత్రాలతో కోలాటం శ్రీకృష్ణార్జున వేషధారణతో భగవన్నామ సంకీర్తనతో సిరిపురం పాండురంగాపురం డౌన్, కాళీమాత ఆలయం మీదుగా గోకుల్‌పార్కు వరకు జరిగింది. శ్రీగీతా శోభాయాత్రను శ్రీరామకృష్ణ మిషన్ స్వామిజీ శ్రీకృష్ణకానంద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు ఈ లోకానికి అందించిన ఉత్తమోత్తమైన గ్రంథం భగవద్గీత అన్నారు. గీతలో సారాంశాన్ని తెలుసుకొని అందరి జీవితాలను సార్థకత చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు చావలి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.జగన్‌మోహన్‌రావు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కార్యదర్శి ఎం.వనిజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, ఎస్.వాసుదేవరావు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

యుద్ధ నౌకలను సందర్శించిన ఆదివాసీ యువత

ఎండాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గిరిజన యువ సమ్మేళనానికి పాల్గొనేందుకు నగరానికి విచ్చేసిన ఆదివాసీ యువత మంగళవారం యుద్ధనౌకలను సందర్శించారు. తూర్పు నౌకాదళంలోని ఐఎన్ఎస్ సావిత్రితో పాటు మరో యుద్ధనౌకను తిలకించారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఐదు జిల్లాల నుంచి విచ్చేసిన ఆదివాసీ యువత నౌకలను చూసి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. అనంతరం హెచ్‌పీసీఎల్‌ని సందర్శించారు. హెచ్‌పీసీఎల్ హెచ్ఆర్ మేనేజర్ సుకిరియన్ ప్లాంట్ పనితీరును వారికి వివరించారు. సాయంత్రం సాగరతీరంలో ఐఎన్ఎస్ కురుసుర జలాంతర్గామి టీయూ- 143 యుద్ధ విమానం సీ వారియర్‌ను తిలకించారు. గీతం వేదికగా నిర్వహిస్తున్న యువసమ్మేళనంలో గిరిజన యువతను మంగళవారం ఫీల్డ్ వర్క్‌లో భాగంగా వీటిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ క్లబ్‌కు రెండు అవార్డులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ క్లబ్‌కు రెండు విభాగాల్లో అవార్డులు వచ్చాయి. ఇటీవల జరిగిన 101 గవర్నర్ సమావేశంలో ఈ అవార్డులను అందజేశారు. అల్వార్‌దాస్ మైదానంలో క్లబ్ క్లబ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌ను సభ్యులు అభినందించారు. ప్రతినెలా వాకర్స్ క్లబ్ సభ్యుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, మహాత్మా గాంధీ ఫౌండేషన్ సభ్యత్వాల నమోదు వంటి సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ఈ అవార్డులు అందుకున్నట్లు కిషోర్‌కుమార్ తెలిపారు.

సినిమా గైడ్

● **పుష్ప-2 :** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడీ, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 26, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 68 దొండకాయలు 30, బంగాళ దుంపలు 33, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 20, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 44, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	618
విజయనగరం	622
శ్రీకాకుళం	622

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

ఇంత నిర్లక్ష్యమా?

» సంజీవ్‌గాంధీ కాలనీలో పాడైన మ్యాన్‌హోల్ » నెలలు గడిచినా పట్టించుకోని అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు బాగుంది కదా అని నిర్లక్ష్యంగా ఉంటూ మలుపు తిరిగితే అంతే సంగతులు... గోతులో పడి కాలువలో మునగడమే... ఇది 16వ వార్డులోని సంజీవ్ గాంధీ కాలనీ కనకదుర్గ ఆలయం మార్గంలో పరిస్థితి. ఈ మార్గంలో చివరన కాలువపై వేసిన మేన్‌హోల్ మూత విరిగి ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలల నుంచి ఇదే పరిస్థితి. ఇటు వైపు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. పెద్ద రోడ్డు కావడంతో ద్విచక్రవాహనం నుంచి భారీ వాహనాలు సైతం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే మ్యాన్‌హోల్‌పై మూత విరిగి సగం కాలువలోకి ఒరిగిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీనికి సమీపంలోనే రెండు సచివాలయాలు కూడా ఉన్నాయి. అధికారులు ఈ మార్గం వైపు పదేపదే తిరుగుతూనే ఉంటారు. అయినా దీన్ని బాగు చేసే దిక్కు లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కనకదుర్గ ఆలయం మార్గంలో పాడైన మ్యాన్‌హోల్

రేపటి నుంచి ఏయూ మైదానంలో ఆర్గానిక్ మేళా



ఆర్గానిక్ మేళా బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

మద్దిలపాలెం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 12 నుంచి నాలుగు రోజుల పాటు ఐదో ఆర్గానిక్ మేళా నిర్వహించానున్నామని గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా గోఆధారిత ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులను 300 స్టాల్స్ ద్వారా మేళాలో ప్రదర్శిస్తున్నామన్నారు. తొలిరోజు రైతు సమ్మేళనం, 13న మీ ఆరోగ్యం మీ చేతిలో, 14న ఫుడ్ ప్రాసెసింగ్, 15న మిద్దె తోటలపై సదస్సు ఉంటాయన్నారు.

గిరిజన పోడు వ్యవసాయోత్పత్తులు, సేంద్రియ విత్తనాలు, ఎరువులు, ఆర్గానిక్ వస్తువులు ప్రదర్శిస్తామన్నారు. మేళాను వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. మేళా పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జలగం కుమార్‌స్వామి, మధుసూదనరెడ్డి, ఉషా గణపతిరాజు, జేవీ రత్నం పాల్గొన్నారు.

భారత వారసత్వం, పురావస్తు శాస్త్రంపై ఉచిత ఆన్‌లైన్ కోర్సు

వెంకోజీపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఏయూ డీన్ వాన్ లేవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్‌తో కలిసి, భారతదేశ వారసత్వం ఐకనోగ్రఫీ, పురావస్తు శాస్త్రం అనే ఒక నెల రోజుల ఉచిత ఆన్‌లైన్ కోర్సును ప్రకటించింది. ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు అధికారిక కోర్సు పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, వర్సిటీ అధికారులు

ఈ సందర్భంగా వీసీ భారతదేశ విస్తార, విభిన్నమైన చారిత్రక వారసత్వం ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రొఫెసర్ రావు మాట్లాడుతూ ఈ కోర్సులో ప్రపంచవ్యాప్తంగా ప్రవేశం పొందిన వారికి భారతదేశపు కళ, చిహ్నాలు, శిల్ప కౌశలం గురించి తెలుసుకోవడానికి ఒక అద్భుత అవకాశంగా ఉంటుందన్నారు. ఇది మన సాంస్కృతిక మూలాలను అవగాహన చేసుకోవడంలో ముందడుగు అన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు మాట్లాడుతూ గ్లోబలైజ్ చేసిన ప్రపంచంలో ఈ రకమైన కోర్సుల ప్రాముఖ్యతను ప్రస్తావించారు. భారతదేశం సమృద్ధిగా ఉన్న చరిత్ర, సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రపంచానికి బోధించగలిగే పాఠాలు ఉన్నాయన్నారు. ఈ కోర్సు ఒక శాస్త్రీయ కఠినతను సులభమైన ఫార్మాట్‌తో కలుపుతూ విభిన్న ప్రేక్షకుల వరకు చేరుకుంటుందన్నారు. డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, డీన్ వాన్ లేవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కోర్సు విషయాన్ని వివరించారు. పాల్గొనే వారు పురాతన భారతదేశ వారసత్వంపై అవగాహన పొందుతారన్నారు. దీనిలో హిందూ దేవాలయ కళ, చిహ్నాలు, శిల్ప శైలుల వివరణ ఉంటుందన్నారు. కోర్సు భారతదేశపు పురావస్తు సైట్ల కొన్ని గుప్త అంశాలను కూడా అన్వేషిస్తుందన్నారు. మన చరిత్ర సమగ్ర అవగాహనను అందిస్తుందని చెప్పారు. ప్రపంచ అన్వేషకుడు, పురావస్తు శాస్త్రజ్ఞుడు ప్రవీణ్ మోహన్ ఈ ఆవిష్కరణ పట్ల తన ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తూ, భారతదేశం ప్రపంచంలోని కొన్ని అత్యంత రహస్య, ఆకర్షణీయమైన పురావస్తు సైట్ల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఇండిక్ ఐకానోగ్రఫీపై సదస్సు



ప్రవీణ్ మోహన్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చరిత్ర, పురాతత్వ శాఖ ప్రత్యేక ఉపన్యాసాన్ని మంగళవారం ఏయూలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత ప్రపంచ అన్వేషకుడు, ఐకానోగ్రఫీ నిపుణులు ప్రవీణ్ మోహన్ పాల్గొని ఇండిక్ ఐకానోగ్రఫీ అండ్ ఎక్స్‌ట్రా టెరెస్ట్రియల్స్ దేవతలు ఎలియన్లు కావా? అనే అంశంపై ఒక ఆలోచనాత్మక ఉపన్యాసం అందించా రు. హిందూ దేవతల ఆధిక్యాన్ని ఎక్స్‌ట్రా టెరెస్ట్రియల్ ప్రాణులుగా ప్రస్తావిస్తూ ఒక ఆసక్తికర సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఇవి భూమి మీద, ప్రత్యేకంగా భారతదేశంలో దూరం నుంచి వచ్చిన అదనపు సిద్ధాంతాలని పేర్కొన్నారు. బాలి, ఇండోనేషియా, గ్రీసు, ఈజిప్ట్ వంటి ఇతర సాంస్కృతిక ఐకానోగ్రఫీలతో పోల్చుతూ, ఆయన తన సిద్ధాంతానికి సంబంధించి దృశ్య ఆధారాలను సమర్పించారు. హిందూ దేవాలయాల ఆర్కిటెక్చర్, శాస్త్రీయ ప్రత్యేకతలపై కూడా దృష్టి పెట్టారు. తమిళనాడులోని సేలం దేవాలయాలు, ఆంధ్రప్రదేశ్‌లో గుడిమల్లా, శ్రీశైలంలోని దేవాలయాలను ఆయన ఉదాహరణలుగా తీసుకుని, ఈ దేవాలయాలు ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ ప్రాణుల ద్వారా అందించిన ఆధునిక జ్ఞానాన్ని సూచించే ప్రతిరూపాలుగా ఉంటాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారతదేశం ప్రత్యేక గమన శక్తి ఆధారిత భౌగోళిక స్థానమేమయితే ఈ ప్రాణుల దౌత్యాన్ని భారతదేశంలోకి తీసుకురావడానికి ప్రధాన స్థలంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మోహన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో మానవ హక్కుల దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. న్యాయ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనా ఏయూ విద్యార్థిని గీతాభార్గవి పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవాన్ని అంతర్జాతీయ సమాజం ప్రతి సంవత్సరం డిసెంబరు 10న నిర్వహించుకుంటుందని, 1948లో ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించిన రోజును గుర్తుచేసుకుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో లా టీచింగ్ సిబ్బంది, పలువురు న్యాయ విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

జర్నలిజం విభాగంలో...

ఏయూ జర్నలిజయం విభాగంలో హ్యూమన్ రైట్స్ పూర్వ విద్యార్థులు, పీపుల్స్ లిబరేషన్ వే వెల్ఫేర్ సొసైటీ, హెచ్ఆర్‌డీ విభాగం, డీడీసీడబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారవు, సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల ఆలయ వార్షికోత్సవం

సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహావిశాఖ 98వ వార్డు గోశాల లే అవుట్‌లోని సింహగిరి నిర్వాసితుల కాలనీలో కొలువుదీరి ఉన్న ఉమామహేశ్వరి పాదాలమ్మ, పుట్టబంగారమ్మ,బాలత్రిపురసుందరి అమ్మవార్ల నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు ప్రభాతారాధనలు పూర్తిచేశాక కాలనీకి చెందిన పలువురు ముత్తైదువలు పంచామృతాలతో అమ్మవార్లకు స్వయంగా అభిషేకాలు చేసి పసుపు కుంకుమలతో పూజ చేశారు. సాయంత్రం పూజారులు శాక్తేయాగమ శాస్త్ర విధానంలో ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అభిషేకాలు చేస్తున్న భక్తులు



గాంధీనగర్-రవీంద్రనగర్ మార్గంలో రోడ్డు పక్కనే చెత్త గుట్ట

రోడ్ల పక్కనే చెత్తకుప్పలు

ఆరిలోవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు నుంచి గాంధీనగర్, రవీంద్రనగర్ వెళ్లే రోడ్డులో కల్వర్టు వద్ద చెత్త గుట్టలు పేరుకుపోయాయి. దీంతో ఈ ప్రాంతమంతా దుర్వాసన వెలువడుతోంది. ఈ కాలువలో పూడికలను వారం కిందట తీశారు. అయితే ఆ చెత్తాచెదారాన్ని కల్వర్టు వద్దే ఉంచేశారు. అప్పటి నుంచి తరలింపునకు చర్యలు తీసుకోలేదు. ఈ చెత్త ఎండకు ఎండి, వానకు తడుస్తుండడంతో దుర్వాసన వెలువడుతోంది. అంతేకాకుండా చెత్తను ఇలా కుప్పలుగా వేయడం వల్ల రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు, వాహనచోదకులు అంటున్నారు.ఈ సమస్యపై జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

» ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు సుధాసాగర్



పాండ్రంగి రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పద్మనాభం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు, మండల రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి ఎస్.సుధాసాగర్ సూచించారు. మండలంలోని పాండ్రంగిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంగళవారం ఆయన ప్రసంగించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలు, రైతులు తమ భూ సంబంధమైన అన్ని రకాల సమస్యలపై వినతులు సమర్పిస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎలాంటి వివాదాలు లేని వాటిని అక్కడికక్కడే ఆన్‌లైన్ చేయించి పరిష్కరిస్తామన్నారు. ఈ సేవలకు ఎటువంటి రుసుము వసూలు చేయకుండా ఉచితంగానే సేవలు అందిస్తామన్నారు. ప్రజలు ఈసేవలను పొంది తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 54 వినతులు స్వీకరించారు. వీటిలో మ్యుటేషన్‌కు సంబంధించినవి 31. ఎఫ్ లైన్ సర్వే కోసం 14, దేవాదాయభూములు, 22ఏ కు సంబంధించి మూడేసి చొప్పున డిజిటల్ సంతకం, లేఅవుట్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఒక్కో దరఖాస్తు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె.ఆనందరావు, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టరు కనకబాబు, ఆర్ఐ శ్యామల పాల్గొన్నారు.

ప్రారంభానికి బంగారమ్మతల్లి ఆలయం సిద్ధం



సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి సహోదరిగా, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్యదేవత బంగారమ్మ తల్లి నూతన ఆలయం త్వరలో ప్రారంభానికి సిద్ధమైంది. కొన్ని దశాబ్దాల క్రితం నుంచి గ్రామదేవతగా పూజలందుకుంటున్న బంగారమ్మతల్లి పాత ఆలయం జీర్ణసితికి చేరడంతో పునర్నిర్మాణానికి సింహాచల దేవస్థానం నిర్ణయించింది. రూ.35 లక్షలతో నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టింది. సుమారు తొమ్మిది నెలల తరువాత నిర్మాణం దాదాపుగా పూర్తైంది. దక్షిణాయనంలో ఆలయాన్ని ప్రారంభించాల్సి ఉన్నందున ఈ నెల 15న ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది. ప్రారంభోత్సవ వేళ ప్రత్యేక యాగం చేసేందుకు వీలుగా ఈఓ వేంద్ర త్రినాధరావు ఆదేశాల మేరకు ఈఈ బండారు రాంబాబు సారథ్యంలో యాగశాల వేగంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.


మిద్దె తోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదాం



కూరగాయల మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖను మిద్దె తోటల నగరంగా తీర్చిదిద్దుదామని జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అధికారి లక్ష్మి అన్నారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాల ఆవరణలో కూరగాయల మొక్కలు నాటిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటల మీద అందరికీ అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మిద్దె తోటలు అధికంగా పెంచాలన్న ఆలోచనతో ఇల్ల పైకప్పుమీద, ఇంటి పరిసరాల్లో బాల్కనీలు, విద్యా సంస్థల ఆవరణలో జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం, ఎస్ఆర్‌యూలతో కలసి కూరగాయల తోటలు అధికంగా పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు : వీఎంఆర్డీఏ చైర్మన్



ప్రణవ్ గోపాల్‌తో చర్చిస్తున్న సీతారాం

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు వీఎంఆర్డీఏ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో ఆయనతో ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కలిశారు. వీరు వీఎంఆర్డీఏ పరిధిలో బాలల హక్కులు, వారి సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. నిత్యం జన సామర్థ్యంతో ఉండే వివిధ ప్రాంతాల్లో బాల వివాహాల నిర్మూలన్న, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనక, పోక్సో చట్టంతో పాటు వివిధ బాలల చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కలిగించేలా హోర్డింగ్ బోర్డులను ఏర్పాటు చేసేందుకు వీఎంఆర్డీఏ పరంగా చర్యలు చేపట్టాలని సీతారం కోరారు.

ఘనంగా సీఆర్ రెడ్డి జయంతి



సర్ కట్టమంచి రామలింగారెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏయూ వ్యవస్థాపక ఉపకులపతి సర్ కట్టమంచి రామలింగ రెడ్డి జయంతిని మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏయూ ప్రధాన పరిపాలన భవనం వద్ద ఉన్న కట్టమంచి రామలింగ రెడ్డి విగ్రహానికి ఉపకులపతి జి.శశిభూషణరావు, రెక్టార్ ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు పూలమాల వేసి అంజలి ఘటించారు. అలాగే స్నాతకోత్సవ మందిరం వద్దనున్న సీఆర్ రెడ్డి విగ్రహానికి సైతం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీఆర్ రెడ్డి ఆలోచనకు ప్రతిరూపంగా ఏయూ నిలుస్తుందన్నారు. వర్సిటీ ఏర్పాటు సమయంలో ఆయనకు అనేక సవాళ్లు ఎదురయ్యాయని, వాటిని ఆయన విజయవంతంగా ఎదుర్కొని ఒక గొప్ప ఆశయ సాధకునిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.నరసింహారెడ్డి, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, డాక్టర్ పద్మశ్రీ కె.ఈశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ తెలుగు శాఖలో...

ఏయూ తెలుగుశాఖలో ఏయూ తొలి ఉపకులపతి సర్ కట్టమంచి రామలింగారెడ్డి 144వ జయంతిని ఘనంగా జరిగాయి. ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యకర్మంలో ముందుగా సీఆర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ సీఆర్ రెడ్డి రావడం వలన దేశ విదేశాలలో పేరు ప్రఖ్యాతలు ఏయూకు వచ్చిందన్నారు. విజ్ఞానమే ప్రధానంగా వర్సిటీ నడిపిన ఘనత సీఆర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎ.నరసింహారెడ్డి, పలువురు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా ఏయూ ఫ్యాకల్టీ క్లబ్ ఆధ్వర్యంలో సీఆర్ రెడ్డి జయంతి నిర్వహించారు.



సర్ సీఆర్ రెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఆచార్యులు అప్పారావు, నరసింహారెడ్డి తదితరులు

ఐఏఎస్ఈ కళాశాలలో వ్యాసరచన పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఏయూ ఐఏఎస్ఈ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఐఏఎస్ఈ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నగరాజకుమారి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు బహూకరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కౌశల్ క్విజ్‌కు మనోజ్ ఎంపిక



మనోజ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూరోడ్డులో గల జీవీఎంసీ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి దాసరి మనోజ్ రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఇ.వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే క్విజ్‌కు ఎంపిక కాగా, అందులో తమ పాఠశాల నుంచి మనోజ్ ఉండడం ఆనందకర విషయమన్నారు. మనోజ్‌కు బహుమతిని అందించి అభినందించారు. విద్యార్థికి గైడ్ టీచరుగా వ్యవహరించిన అన్నారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

13న జిల్లా విలువిద్య జట్టు ఎంపిక పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా సబ్ జూనియర్ బాలుర, బాలికల విలువిద్య జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 13న సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఇండియన్ రౌండ్, కాంపౌండ్, రికర్వ్ ఈవెంట్లలో ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9 గంటలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.

పతాక నిధికి రూ.లక్ష విరాళం

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక నిధికి డాక్టర్ గిరి వర్మ రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం ఇందుకు సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్‌కు అందజేశారు.

15 వరకు పుస్తక ప్రదర్శన

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ఈ నెల 15 వరకు పొడిగించారు. టర్నర్ చౌల్ట్రీలో నిర్వహిస్తున్న 23వ పుస్తక మహోత్సవ ప్రదర్శన నగర ప్రజలకు, పుస్తక ప్రియులకు మంచి వేదికగా నిలిచింది. పుస్తక ప్రియుల కోరిక మేరకు 15 వరకు పొడిగించినట్లు మేనేజర్ రాజు తెలిపారు.

రుణయాప్ ఘటనలో యువకుడి ఆత్మహత్యపై కేసు నమోదు

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రుణ యాప్ నిర్వాహకుల వేధింపులు కారణంగా కొత్తగా పెళ్లయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అందిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం పోలీసు కమిషనరేట్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించటం, మహిళలను అవమానించటం, నేర పూరిత బెదిరింపులకు పాల్పడటం, లైంగిక అసభ్యకరమైన విషయాలను ప్రచురించటం వంటి నేరపూరిత సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితుడి మొబైల్ ఫోన్‌ను పరిశీలించి నిందితులను గుర్తించేందుకు సైబరు నిపుణుల బృందాన్ని నియమిస్తామన్నారు. ప్రాథమిక విచారణలో నేరస్థులు రాష్ట్రం వెలుపల నుంచి వచ్చినట్లు తెలుస్తోందని, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పంపిస్తామన్నారు.

'జాయ్ జమీమా తప్పు చేయలేదనడం దారుణం'

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాయ్ జమీమా ఏ తప్పు చేయలేదని కొందరు అనడం దారుణమని ఎన్ఆర్ఐ బాధితుడి తల్లి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాము చేసే బిజినెస్‌ను ప్రమోట్ చేస్తానంటూ వచ్చిందని, తన కుమారుడు చెప్పడంతో ఆమె మాటలు నమ్మానన్నారు. అనంతరం తన కుమారుడిని మచ్చిక చేసుకుని బిజినెస్‌ను అప్పజెప్పాలని ఒత్తిడి తెచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనకు, తన కుమారుడికి మధ్య మనస్పర్థలు పెంచిందని తెలిపారు. తనకు తెలియకుండానే అమెరికా నుంచి తన కుమారుడిని విశాఖకు రప్పించి హోటల్‌లో పెట్టి, మత్తు మందు కలిపి ఇచ్చిందని ఆరోపించారు. ఆమె పెట్టిన ఇబ్బందులను వాయిస్ మెసేజ్ ద్వారా తన కుమారుడు తెలియజేశాడన్నారు. వాస్తవాలిలా ఉంటే అమాయకురాలని వెనకేసుకురావడం ఏమిటని లక్ష్మి ప్రశ్నించారు.

విరిగిన విద్యుత్ స్తంభం తొలగించేదెప్పుడు?



ఫ్లైఓవర్‌పై పడి ఉన్న స్తంభం

జ్ఞానాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1న తుఫాన్ సమయంలో జ్ఞానాపురం ఫ్లైఓవర్‌పై విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 10 రోజులు గడుస్తున్నా జోన్-5 విద్యుత్ దీపాల విభాగ అధికారులు వాటిని తరలించలేదు. ఫుట్‌పాత్‌పై విడిచిపెట్టారు.వంతెనపై స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తుంటారు. స్తంభం అడ్డుగా ఉండడంతో నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి విరిగిన స్తంభాన్ని తరలించి కొత్త స్తంభం వేయాలని కోరుతున్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ అంతర కళాశాలల ఆటల పోటీల్లో శ్రీ కాశ్యప్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిగ్రీ విద్యార్థి శశిభూషణ్ కరాటేలో ప్రథమ స్థానంతోపాటు, యూనివర్సిటీ కబడ్డీ టీమ్‌లో ప్రాబబుల్స్‌లో స్థానం సంపాదించాడు. బాక్సర్‌గా బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ కళాశాల విద్యార్థుల బృందం ఏయూ స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జోత్స్నాలు అభినందించారు.

భారీ ఎత్తున మహా ప్రసాదం తయారీ

» కనకమహాలక్ష్మి ఆలయంలో విక్రయానికి ఏర్పాట్లు » ఈవో ప్రత్యక్ష పర్యవేక్షణ » రేపు పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని అంచనా

జగదాంబ కూడలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం పెద్దసంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తారన్న అంచనాతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి మహా ప్రసాదం భక్తులకు ప్రీతికరం. అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులు గుడి వెలుపలకు వచ్చే ముందు వారి దృష్టి ప్రసాదాల కౌంటర్లపై పడుతుంది. అందులోనూ ఇక్కడి లడ్డూ, పులిహోర, చక్ర పొంగలిని భక్తులు చాలా ఇష్టపడతారు. రాకపోకలు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం, ఉచిత అన్న సమారాధన, ముఖ్యుల సందర్శన, మహిళలు, పిల్లల భద్రత ప్రధాన ఘట్టాలుగా తీసుకుని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సువాసనలు వెదజల్లే అమ్మవారి ప్రసాదమైన లడ్డూ, పులిహోర, చక్రపొంగలి రుచులు చూడాల్సిందే అన్నది భక్తుల ఆలోచన. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఉభయగోదావరి జిల్లాల నుంచి కనకమహాలక్ష్మి దర్శనం కోసం వేల సంఖ్యలో వస్తుంటారు. భక్తులకు అమ్మవారి ప్రసాదం అందలేదన్న నిరాశ ఉండకూడదనే ఉద్దేశంతో ఆలయ ఈవో కె.శోభారాణి వేల సంఖ్యలో లడ్డూ, పులిహోర, చక్రపొంగలి ప్యాకెట్లు తయారు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం ప్రసాద తయారీ చేస్తున్న వంట శాలలో స్వయంగా వాటి నాణ్యతను ఆమె పరిశీలించారు. ప్రసాదాల ప్యాకింగ్, తయారీ చేసిన లడ్డూలను, పులిహోర ప్యాకింగ్ ముందు ఉంచే పద్ధతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గురువారం 40 వేల వరకు లడ్డు ప్యాకెట్లు, 35 నుంచి 38 వేల పులిహోర పొట్లాలు, 35 వేల చక్రపొంగలి ప్యాకెట్లను భక్తులకు విక్రయించడానికి సిద్ధం చేయిస్తున్నారు. భక్తులు సులభంగా వాటిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం ఉద్యోగులు, అధికారులకు పనివిభజన బాధ్యతలు అప్పగించనున్నారు. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి.



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రసాదం తయారీని పర్యవేక్షిస్తున్న కార్యనిర్వహణాధికారిణి కె.శోభారాణి తదితరులు

సాధించుకున్నవాటి కోసం మళ్లీ పోరాడాలా?

» కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆక్షేపణ » బోనస్, వేతన సవరణ బకాయిల చెల్లింపునకు పోర్టు కార్మికుల డిమాండ్

జగదాంబ కూడలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోర్టు యాజమాన్యం నాలుగేళ్ల బోనస్ బకాయిలు చెల్లించాలని, వేతన సవరణ ఒప్పందాలు తక్షణం అమలు చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పోర్టు అథారిటీ చైర్మన్ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. సీఐటీయూ జాతీయ సమాఖ్య కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఒంటెత్తు పోకడల వల్ల కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని దుయ్యబట్టారు. పోర్టు ట్రస్ట్ ఈ ఏడాది రూ.725 కోట్ల లాభాలు ఆర్జించిందని, ఇందుకు కారణం కార్మికులే అన్నారు. పోరాడి వేతన ఒప్పందం సాధించుకున్నా అమలుకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వెనుక కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యధోరణే కారణమని విమర్శించారు. బోనస్ చెల్లింపుపై 2020-26 వరకు అంగీకారం కుదిరినా, కేంద్ర మంత్రివర్గం ఆమోదం లేనందున అడ్వాన్స్ చెల్లింపులు మాత్రమే జరిపారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం మంత్రివర్గం ఆమోదించి పూర్తి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు, ఏఐటీయూ ప్రధాన కార్యదర్శి మసేను మాట్లాడుతూ కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని విమర్శించారు. పోరాటాలతో సాధించుకున్న వేతన ఒప్పందం అమలుకు మళ్లీ పోరాడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల డిమాండ్లను తక్షణం అమలు చేయాలంటూ అన్ని ప్రధాన పోర్టు కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆందోళనలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులు కె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, మంగయ్యనాయుడు, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు చందు, బీఎంఎస్ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.



పోర్టు అథారిటీ చైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు

కళలతో మానసిక ఉల్లాసం



సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కళలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని పలువురు కళా రంగ ప్రముఖులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కేవీఆర్ స్వర సంగీత్ సంగీత్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ముందుగా కళా సంస్థల అధ్యక్షులు కొణతాల రాజు, జి.త్యాగరాజు, వీరేంద్రయాదవ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. గాయనీ గాయకులు 'ఇదేదో...గోలగా...ఏం..వానో తరుముతున్నది...రబ్బరు గాజులు' తదితర గీతాలను వీరేంద్రయాదవ్, స్వర్ణ, మహ్మద్‌ఖాన్, కోటేశ్వరరావు, బాలకృష్ణ, చెన్నా తిరుమలరావు శ్రావ్యంగా ఆలపించి సంగీత రస హృదయాలను కట్టిపడేశారు. ఈ సందర్భంగా వీరేంద్రయాదవ్ మాట్లాడుతూ సినీ సంగీతంపై చిన్నప్పటి కళలపై మక్కువతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెస్ మాధవ్, ప్రభాకర్, ఆశాలత, రాజు, చిరంజీవి, చంద్రకళ, ఆంజనేయరెడ్డి, రంజిత, శ్రీనివాస్, రాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రాంతాలకు నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొద్ది రోజులు పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 06081 నంబరు గల కొచువేలి-షాలిమార్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20 నుంచి జనవరి 24 వరకు ప్రతి శుక్రవారం, తిరుగు ప్రయాణంలోని 06082 నంబరు గల షాలిమార్-కొచువేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 23 నుంచి జనవరి 27 వరకు ప్రతి సోమవారం; 06087 నంబరు గల తిరునెల్వేలి-షాలిమార్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 19 నుంచి జనవరి 23 వరకు ప్రతి గురువారం, తిరుగు ప్రయాణంలో 06088 నంబరు గల షాలిమార్-తిరునెల్వేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 21 నుంచి జనవరి 25 వరకు ప్రతి శనివారం; 06055 నంబరు గల పొదనూర్-బరౌని ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 21 నుంచి జనవరి 25 వరకు ప్రతి శనివారం, తిరుగు ప్రయాణంలోని 06056 నంబరు గల బరౌని-పొదనూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 24 నుంచి జనవరి 28 వరకు ప్రతి మంగళవారం; 06095 నంబరు గల తంబరం-సంత్రాగచ్చి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 19 నుంచి జనవరి 23 వరకు ప్రతి గురువారం, తిరుగు ప్రయాణంలోని 06096 నంబరు గల సంత్రాగచ్చి-తంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 20 నుంచి జనవరి 24 వరకు ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు బ్యారక్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు జరిగాయి. పురుషులు, మహిళల విభాగాల్లో చెస్, డిస్కస్ త్రో, రన్నింగ్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాధికారిణి జూన్ గ్యాలియట్, ద ఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, పారా స్పోర్ట్సు ఆఫ్ అసోసియేషన్ ప్రతినిధులు గొనుగొంట్ల కోటేశ్వరరావు, రామస్వామి, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ క్రీడాకారులు

'హక్కులను హరిస్తున్న మోదీ ప్రభుత్వం'

సీతంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆత్మ గౌరవంతో స్వేచ్ఛగా జీవించే హక్కు లేకుండా చేస్తుందని, మానవ హక్కులను హరిస్తోందని పలువురు వక్తలు ఆరోపించారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఇస్కఫ్, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినం సందర్భంగా మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ దళితులు, మైనార్టీలపై దాడులతో హక్కులను కాలరాస్తూ మతోన్మాద రాజకీయానికి పాల్పడుతోందన్నారు. గిరిజన ప్రాంతాలను బలవంతంగా ఖాళీ చేయించి ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకించిన వారిని నక్సలైట్ల పేరుతో హత్యలు చేయిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందని, ఏమి తినాలో, ఏ దుస్తులు వేసుకోవాలో, ఎవరిని పూజించాలో కూడా వారే శాసిస్తున్నారన్నారు. ప్రధాని మోదీ మణిపూర్ వెళ్లేందుకు ఆసక్తి చూపించలేదన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి అవమానిస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు బొడ్డు కల్యాణరావు, రామప్రభు, ఉప్పల అప్పలరాజు, చిన్నారావు, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సొసైటీ ప్రతినిధులు, నిర్వాహకులు

వసతి గృహాలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

రూ.8.65 లక్షలు, గాజువాక నియోజకవర్గ పరిధిలోని రెండు బాలికల వసతి గృహాలకు రూ.20.09 లక్షలు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని ఐదు బాలురు, నాలుగు బాలికల వసతి గృహాలకు రూ.117.99 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఈ నిధులతో ఆయా వసతి గృహాల భవనాలకు మరమ్మతులు చేయనున్నారు. అలాగే తాగు నీరు, డ్రైనేజీ, టాయ్‌లెట్లు, ఫ్లోరింగ్, మస్కిటో నెట్స్ ఏర్పాటు వంటి వాటికి ఆ నిధులు వినియోగించనున్నట్టు డిప్యూటీ డైరెక్టర్ రామారావు వెల్లడించారు. కొద్దిరోజుల్లోనే పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు.

18 నుంచి జాతీయ వినియోగదారుల వారోత్సవాలు

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై విషయ అవగాహనతో మోసాలు నిరోధించవచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కరరావు తెలిపారు. మంగళవారం పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం ప్రచార అంశంగా ఈ నెల 14 నుంచి 24 వరకు జిల్లాలో వినియోగదారులు వారోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. వినియోగదారుల సంఘాల సహకారంతో వారం రోజులు వినియోగదారుల హక్కుల రక్షణ బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో కె.వెంకటరమణ, పి. రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ అధికారి భాస్కరరావు

పథకాల అమలు తీరుపై కలెక్టర్ సమీక్ష

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 12 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో విజయవాడలో జరగనున్న కలెక్టర్ల సదస్సు నేపథ్యంలో మంగళవారం వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ ఎం ఎన్ హరేందిర ప్రసాద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర, విశాఖపట్నం విజన్ ప్రణాళిక, జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల తీరుపైన సుదీర్ఘంగా చర్చించారు. తాజా పరిస్థితిని తెలుపుతూ నివేదికలు పొందుపరచాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పేరుతో నాటకం

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌టెన్షన్ ఏరియా అంతా ఇప్పుడు ఆస్పత్రుల జోన్‌గా మారిపోయింది. ఎన్ఆర్ఐ ఆస్పత్రికి కేవలం కిలోమీటరు పరిధిలోనే పదికి పైగా ఆస్పత్రులు, మెడికల్ లేబొరేటరీలు, డ్రగ్ స్టోర్స్ ఉన్నాయి. ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఎదురుగానే ఈఎన్‌టీ వైద్యుల క్లినిక్ ఉంది. రాజీవన్ ఆస్పత్రి స్థలం ఎదురుగా మరో రెండు డెంటల్ క్లినిక్‌లు ఉన్నాయి. విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఉంది. అటు సీతమ్మధార డౌన్‌లోకి వెళితే నిఖిత ఆస్పత్రి, అల్లూరి విగ్రహం పక్కనే మూడు ఆస్పత్రులు, నాలుగు మందుల దుకాణాలు ఉన్నాయి. అందరికీ ఆస్పత్రుల నిర్వహణ లాభదాయకంగా ఉండగా, వారికి లేదని చెప్పడం పూర్తిగా వాస్తవ దూరం. అసలు ఆస్పత్రి నిర్మించకుండా వ్యాపారం లేదని చెప్పడం మరో విశేషం. ఎన్‌ఓసీ కోసం వారు పెట్టుకున్న దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఉంటే వీఎంఆర్‌డీఏ అధికారులు బహుళ అంతస్థుల భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చేవారు కాదు. ఆ సంస్థ నిర్వాహకులకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ఎన్‌ఓసీ ఇచ్చారని, అది నిబంధనలకు విరుద్ధమని అధికారులు చెబుతున్నారు.

కమిషనర్ దృష్టికి కూడా తీసుకువెళ్లలేదు

ఇలా భూ వినియోగ మార్పిడికి సంబంధించిన దరఖాస్తు వస్తే దానిని ప్రాసెస్ చేసి సంస్థ ఉన్నతాధికారి అయిన కమిషనర్‌కు పంపాలి. దానిని ఆయన పరిశీలించి, నోట్ రాసి ప్రభుత్వ పరిశీలనకు పంపాలి. ఇదీ నిబంధన. కానీ ఈ స్థలం విషయంలో అప్పటి సెక్రటరీగా పనిచేసిన అధికారి తానే నిర్ణయం తీసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం స్టాండింగ్ కౌన్సిల్ సిఫారసుతో ఎన్‌ఓసీ ఇచ్చేశారు. ఇలాంటి విషయాల్లో స్టాండింగ్ కౌన్సిల్ సిఫారసు పరిగణనలోకి తీసుకోకూడదని వీఎంఆర్‌డీఏ ఉన్నతాధికారి ఒకరు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ వ్యవహారంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, ఆ విషయం సంస్థ నివేదిక వెల్లడిస్తుందని వివరించారు.

స్థూల ఆదాయంలో విశాఖపట్నం ఫస్ట్

... 5వ పేజీ తరువాయి

సూచించారు.

- విశాఖ జిల్లాకు రోజుకు 301.9 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం కాగా అందులో 264 మిలియన్ గ్యాలన్లు మాత్రమే అందుబాటులో ఉందని మిగిలిన నీటి కోసం చేపట్టిన పది ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది.
- విశాఖ జిల్లా ఘన వ్యర్థాల నిర్వహణలో 98 శాతం రేటింగ్‌తో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది.
- జిల్లాలో రహదారులపై మొత్తం 2,783 గుంతలు ఉండగా, వాటిలో ఇప్పటివరకూ 2,242 పూడ్చారని, ఇంకా 541 పూడ్చాల్సి ఉందని నివేదించారు.
- విశాఖ జిల్లాలో 2,43,669 మంది సమాచారం అందుబాటులో లేదని ప్రభుత్వం గుర్తించింది. కొంతమంది వివరాలు సేకరించారు. ఇంకా 98.87 శాతం మంది వివరాలు గుర్తించాల్సి ఉంది.

మధురవాడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

... 5వ పేజీ తరువాయి

అక్కడి అవసరాలకు తగినట్టుగా రూ.2.68 కోట్లతో కమర్షియల్, కన్వెన్షన్ సెంటర్లు నిర్మించాలని నిర్ణయించారు.

- భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ వివిధ ప్రాంతాల్లో 15 రహదారుల నిర్మాణానికి ఆమోదించారు. వీటికి అవసరమైన నిధులను చినముషిడివాడ, తుమ్మపాలలో వీఎంఆర్‌డీఏ భూముల అమ్మకం ద్వారా సమకూర్చుకోవాలని తీర్మానించారు.
- విశాఖపట్నం సెంట్రల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటెన్‌ను 40 నెలలు నిర్వహించడానికి రూ.1.84 కోట్లతో అంచనాలకు ఆమోదం తెలిపారు.
- రుషికొండలో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఢిల్లీ తరహాలో అర్బన్ హ్యాబిటేట్ సెంటర్‌ను పీపీపీ విధానంలో నిర్మించాలని తీర్మానించారు.

అస్త్రశస్త్రాలతో సిద్ధం

... 5వ పేజీ తరువాయి

అంశాలపై లోతుగా చర్చకు పట్టుబట్టే అవకాశం ఉందనేది గుర్తించి...వాటిపై వారి వాదనను సమర్థంగా తిప్పికొట్టేందుకు పూర్తి సమాచారంతో సన్నద్ధంగా ఉండాలని కొందరు కార్పొరేటర్లకు నాయకులు సూచించారు. ఏది ఏమైనప్పటికీ బుధవారం నాటి కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరగడం ఖాయమని ఇరువర్గాల కార్పొరేటర్లు పేర్కొంటున్నారు.

ఆగని మానవ హక్కుల ఉల్లంఘనలు

మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘన అనేక చోట్ల జరుగుతూనే ఉందని మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'అందరికీ స్వేచ్ఛ-అందరికీ సమానత్వం, న్యాయం' అనే అంశంపై మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఆయన ప్రసంగిస్తూ రాజ్యాంగం ప్రజలకు భావవ్యక్తీకరణ, నిరసన తెలిపే హక్కు కల్పించిందన్నారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో స్పష్టం చేసిందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జగన్‌మోహన్‌రావు, ప్రతినిధులు ఎస్వీ రమణ, సోమసుందరరావు, మల్లేశ్వరరావు, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో మంగళవారం మానవ హక్కుల చైతన్య ర్యాలీ జరిగింది. మానవ హక్కుల ప్రాముఖ్యతను తెలిపేవిధంగా రూపొందించిన స్కిట్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ కమల్ జిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేంద్రీయ విద్యాలయంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా ఉమామార్కండేశ్వర స్వామి కల్యాణం

కూర్మన్నపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి పద్మశాలివీధిలో శ్రీఉమామార్కండేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఉమామార్కండేశ్వర స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్.సత్యం, ఉమ, కె.వెంటారావు, ఈశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'కార్యకర్తలంతా టీడీపీ సభ్యత్వం పొందాలి'

పెదగంట్యాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు, అభిమానులందరూ తప్పనిసరిగా సభ్యత్వాన్ని పొందాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణా రెడ్డి కోరారు. మంగళవారం కండిపిల్లివారి వీధిలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదులో పెదగంట్యాడ ముందంజలో ఉండాలన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు ఎం.పెంటయ్య, కె.రమణ, బి.అప్పలరెడ్డి, త్రినాథ్, గురువునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'పల్లా'ను సత్కరించిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఘనంగా సత్కరించారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పల్లా మాట్లాడుతు రాష్ట్రంలో కబడ్డీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి గాను గాజువాకలోని ఆదర్శ మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, ప్రతినిధులు ఉరుకూటి బాబూరావు, ఎం.గణపతిరావు, ప్రసాదుల శ్రీనివాసరావు, పల్లా సత్యనారాయణ, వి.చిన బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

బొర్రమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మార్గశిర మంగళవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు.

సందడిగా భూలోకమాంబ మారువారం పండుగ

వేపగుంట, డిసెంబరు 10: స్థానిక బీసీకాలనీలోని భూలోకమాంబ అమ్మ వారి మారువారం పండుగ మంగళవారం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణను కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ముత్తా నాయుడు, సాలాపు రమణ, సూరిబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 26, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజీ 20, క్యారెట్ 68, దొండకాయలు 30, బంగాళదుంపలు 33, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 56, మునక్కాడలు (కిలో) 120, బరబాటి 20, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 44, కీరదోస 28, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 50, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, పాలకూర (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, కర్రపెండలం 28, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, మామిడి అల్లం 64, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	618
విజయనగరం	622
శ్రీకాకుళం	622

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	296
స్కిన్‌లెస్	206

ఎప్పుడు.. ఏం జరుగుతుందో!



- స్టీల్‌ప్లాంటులో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు
- ముగిసిన పలువురి కాంట్రాక్టర్ల కాలపరిమితి
- కొత్తగా టెండర్లు పిలవకపోవడంతో పనులు కోల్పోతున్న కార్మికులు
- ఇప్పటికే వెయ్యి మంది ఉపాధికి దూరం..
- మళ్లీ టెండర్లు పిలవాలని కోరుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో కాంట్రాక్టు కార్మికులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. స్టీల్‌ప్లాంటులోని ఆయా విభాగాల్లో కాంట్రాక్టర్ల వద్ద ఏళ్లతరబడి కొంతమంది కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆయా విభాగాల్లో కాంట్రాక్టర్లు మారినా పనిచేసే కార్మికులు మాత్రం అక్కడే విధులు నిర్వహించేవారు. అయితే ఇటీవల కాలంలో కొంత మంది కాంట్రాక్టర్ల టెండర్ గడువు ముగియడంతో ఆయా విభాగాల నుంచి నిష్క్రమించారు. దీంతో ఆయా విభాగాల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది.

ఈ విధంగా ఇప్పటివరకు సుమారు వెయ్యి మంది వరకు కాంట్రాక్టు కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. దీంతో యూనియన్ నాయకులు టెండర్ల కాలపరిమితి ముగిసిన విభాగాల్లో మళ్లీ కొత్త టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను తగ్గించుకునే క్రమంలోనే ఆయా విభాగాల్లో నూతనంగా కాంట్రాక్టు పనులకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉక్కు కర్మాగారం ప్రగతిలో ఎంతో కృషి చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్రను యాజమాన్యం మానుకోవాలని కార్మిక నాయకులు కోరుతున్నారు.

గతంలో కాంట్రాక్టు కార్మికులను తగ్గించేందుకు గాను సుమారు 4,200 మంది గేటు పాసులను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఉక్కు యాజమాన్యం తొలగింపు ప్రక్రియను నిలిపివేసింది. అయితే పొమ్మన లేక పొగ పెట్టారన్న చందంగా కాంట్రాక్టర్ల కాలపరిమితి ముగిసినా కొత్తగా టెండర్లను పునరుద్ధరించకపోతే కార్మికులే ఆగిపోతారని భావించి యాజమాన్యం ఈ విధంగా చేస్తుందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనా పనుల్లేక రోడ్డున పడుతున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

- అధికారులు చక్కగా పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచిపేరు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

శ్రీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. 71వ వార్డు పరిధి దిబ్బపాలెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. భూముల కంప్యూటరీకరణ, సర్వే, తదితర సమస్యలపై దిబ్బపాలెం నిర్వాసితులు వినతులు సమర్పించగా, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించేటప్పుడు బాధితులతో చర్చించాలన్నారు. అధికారులు చక్కగా పని చేసినప్పుడే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. దిబ్బపాలెం కాలనీలో వైసీపీ హయాంలో రహదారులను ఆక్రమించి బహుళ అంతస్థులను నిర్మించారని, సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పల్లా సమక్షంలో అధికారులకు విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ ఈ సదస్సులో 11 అర్జీలు వచ్చాయని, త్వరితంగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆక్రమణలకు గురైన భూములు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై విచారణ జరిపి దిబ్బపాలెం నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మధుసూదన్, కార్పొరేటర్లు రాజాన రామారావు, గంధం శ్రీనివాసరావు, ఏజే స్టాలిన్, టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు, పప్పు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

జలమయమైన భగత్‌సింగ్ కాలనీ

- పగిలిపోయిన భూగర్భ తాగునీటి పైప్‌లైన్
- ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికుల ఆందోళన



పైప్‌లైన్ పగిలి ఓ ఇంట్లోకి చేరిన నీరు



జలమయమైన పరిసర ప్రాంతాలు

గోపాలపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం భూగర్భంలో ఏర్పాటుచేసిన పైప్‌లైన్ పగలడంతో భగత్‌సింగ్‌నగర్ కాలనీ రహదారి జలమయమైంది. గ్రేటర్ 89వ వార్డు కొత్తపాలెం శివారులో పోర్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు భగత్‌సింగ్‌నగర్ కాలనీను నిర్మించారు. అంతకుముందే కాలనీ మీదుగా ఎంఈఎస్ (మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్) శాఖ భూగర్భ మంచినీటి పైప్‌లైన్ వేసింది. కాలనీ వుడా లేఅవుట్ కావడంతో పైప్‌లైన్ ఉన్న విషయం తెలియక స్థలాలు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టారు. ఇదిలాఉంటే సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత భగత్‌సింగ్‌నగర్‌లో ఉన్న భూగర్భ పైప్‌లైన్ పగిలి ఓ ఇంటి సెల్లార్ నుంచి నీరు ప్రవహించింది. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న రహదారి జలమయమయింది. సమీపంలోని లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. పైప్‌లైన్ ఎంఈఎస్‌కు చెందినది కావడంతో ఎవరికి ఫిర్యాదు చెయ్యాలో తెలియని పరిస్థితిలో మంగళవారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది మరమ్మతులు ప్రారంభించారు.

ఆందోళనలో కాలనీ వాసులు

దశాబ్దాల క్రితం ఈ ప్రాంతం ఖాళీగా ఉండడంతో అనుమతులు లేకుండా పైప్‌లైన్ వేశారు. ఇప్పుడు లేవుట్‌లో ఇళ్ల నిర్మాణం జరగడంతో పైప్‌లైన్ ఏప్రాంతంలో ఉందో తెలియక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరిగి ఎప్పుడు ఏ ఇంటి కింద నుంచి పైప్ లీకవుతుందో తెలియని అయోమయ పరిస్థితి ఉందంటున్నారు. ఎంఈఎస్ అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆదర్శ స్కూల్ తరలింపునకు యాజమాన్యం అంగీకారం

గాజువాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గాజువాక వుడా కాలనీ సమీపం ఆదర్శ మైదానానికి ఆనుకుని ఉన్న ఆదర్శ స్కూల్‌ను వేరేచోటకు తరలించేందుకు పాఠశాల యాజమాన్యం అంగీకరిస్తూ అందుకు సంబంధించిన పత్రాన్ని మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ప్రిన్సిపాల్ టి.ప్రభ అందజేశారు. ఆదర్శ మైదానాన్ని ఆధునిక క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు తాము కృషి చేస్తున్నామని పల్లా పేర్కొన్నారు. తమ పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరంలో నూతన భవనంలోకి మారుస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు యాజమాన్యం ఉపాధి కల్పించాలని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, పులి రమణారెడ్డి కోరారు. నిర్వాసితులకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత ఉపాధి కాకపోయినా జీవనం సాగించేందుకు కాంట్రాక్టు కార్మికుల పోస్టులైనా ఇవ్వాలని పేర్కొన్నారు.

తప్పిపోయిన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత



తల్లిదండ్రులకు విద్యార్థిని అప్పగిస్తున్న పోలీసులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ నుంచి అదృశ్యమైన విద్యార్థిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. టౌన్‌షిప్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎన్.రుత్విక్ నాయుడు (13)కు స్కూల్‌లో మార్కులు తక్కువ రావడంతో తల్లిదండ్రులను తీసుకురావాలని టీచర్ చెప్పారు. దీంతో ఆ విద్యార్థి స్కూల్ బ్యాగ్‌ను అక్కడే విడిచిపెట్టి సైకిల్‌పై వెళ్లిపోయాడు. స్కూల్ సమయం అయిపోయినా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవటంతో స్టీల్‌ప్లాంట్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఈ.కేశవరావు తమ సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి టౌన్‌షిప్‌లో ఆ విద్యార్థిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

చట్టాలపై అవగాహనతోనే సంపూర్ణ న్యాయం

- గాజువాక ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కవిత



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కవిత

మల్కాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగహన ఉంటేనే సంపూర్ణమైన న్యాయం పొందుతారని, విద్యార్థి స్థాయి నుంచే న్యాయపరమైన విషయాలను తెలుసుకోవాలని గాజువాక ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎస్.కవిత పేర్కొన్నారు. శ్రీహరిపురంలోని స్వామి వివేకానంద పాఠశాలలో గాజువాక లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ మానవ హక్కుల అవగహన దినోత్సవంలో ఆమె మాట్లాడారు. పేదవారి తరఫున కోర్టులో వాదించడానికి ప్రభుత్వం నియమించే న్యాయవాదులు ఉంటారని వారి ద్వారా పేదలు, మహిళలు, దివ్యాంగులు, దళిత, గిరిజన, ప్రమాదాల్లో సర్వం కోల్పోయిన వారు న్యాయం పొందవచ్చునని తెలిపారు.హ్యూమన్‌రైట్స్ కమిషనర్ ద్వారా మానవాళి హక్కులను పొందవచ్చునన్నారు. అందరికీ చదువుకునే, వైద్యసేవలు పొందే హక్కు ఉందని ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీటిని ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పోతిన రాంబాబు, పాఠశాల కరస్పాండెంట్ దాసరి మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ డి.రేణు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ బల్లకు వినతిపత్రం ఇస్తున్న కొండవాలు ప్రాంతవాసులు

వేపగుంట డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న వారికి మెట్లు సౌకర్యం ఏర్పాటు చేయాలని మంగళవారం కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఓ వినతిపత్రం సమర్పించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. వాటర్ వర్క్స్ విభాగంలో పనిచేస్తున్న వారి జీతాలు పెంచాలని, దీనిపై కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని జోన్ 8 వాటర్ వర్క్స్ సిబ్బంది వినతిపత్రం ఇచ్చారు. ఆనంద్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు భూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

- రెవెన్యూ సదస్సులో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



రెవెన్యూ సదస్సులో వినతిపత్రాలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం గ్రామానికి పోర్టుతో ఉన్న భూమి సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. స్థానిక మరిడిమాంబ కల్యాణమండపంలో 40, 61, 62, 63 వార్డులకు సంబంధించి మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో భూముల విషయంలో చేసిన తప్పిదాలను సరిదిద్దడానికే కూటమి ప్రభుత్వం సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. పోర్టు, నేవీ, రైల్వే భూములతోనే నియోజకవర్గంలో సమస్యలున్నాయని వాటిని దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ స్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తారన్నారు. హెచ్‌పీసీఎల్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన వారందరికీ న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు వినతిపత్రాలను అందజేశారు. తహసీల్దార్ భుజంగరావు, జోన్ 5 కమిషనర్ రాము, డిప్యూటీ తహసీల్దార్ దొడ్డి రమ, ఆర్ఐ దివ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ కంఠం కాపాడాలని కోరుతూ మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం వినతిపత్రం సమర్పించగా, ఎస్సీ కాలనీ వాసులకు ఇంటి పట్టాలు లేవని, మరోచోట స్థలాలు కేటాయించాలని రామ్-రాంజీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు.

పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలి

పెందుర్తిరూరల్: తమ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు, 1బి రికార్డులు లేక ప్రభుత్వపరంగా అందాల్సిన రుణాలు, రాయితీలు అందడం లేదని మండలంలోని పోర్లుపాలెం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ 95వ వార్డు పోర్లుపాలెంలో తహసీల్దారు ఆనందకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సంబంధిత వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను వివరించారు. 22ఎలో నుంచి తమ భూములను తొలగించాలని, పట్టాదారు పాసు పుస్తకాలను మంజూరు చేయాలని కోరారు. శ్మశానం సరిహద్దులు గుర్తించాలని స్థానికులు విన్నవించారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.



ధర్నాలో పాల్గొన్న మంత్రి రాజశేఖర్, తదితరులు

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జీతాల చెల్లింపు విషయంలో ఉక్కు యాజమన్యం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఇబ్బందులను యాజమాన్యం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తి తీయాలని పేర్కొన్నారు. ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ కార్మికులను ఇబ్బందులకు గురి చేసే చర్యలను యాజమాన్యం విడనాడాలన్నారు. హెచ్ఆర్ఏ అమలు చేయాలని, టౌన్‌షిప్‌లో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బీఎన్ రాజు, కొవిరి అవతారం, ఎస్ఏ నాయుడు, డి.మోహన్, జి.ప్రభాకరరెడ్డి, రాథోడ్, రవి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గ్రూప్ ఫొటో దిగిన కణితి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-91 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు మంగళవారం స్కూల్ ఆవరణలో కలిసి ఆనందంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ, ఒకరొకరు యోగక్షేమాలు, పిల్లల చదువుల గురించి తెలుసుకుని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుగ్గపు దానప్పలు, బలిరెడ్డి నాగేశ్వరరావు, తుంపాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న 'నల్లూరు'



పల్లా చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వ నమోదు పత్రాన్ని అందుకుంటున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న తొలి నాయకుడు 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని పల్లా చేతుల మీదుగా నల్లూరు తీసుకున్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం టీడీపీ ఎంతో కృషి చేస్తుందన్నారు. టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తతో పాటు కుటుంబానికి భరోసా, భద్రత లభిస్తుందన్నారు. నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ 86వ వార్డులో బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలను ఒక తాటిపైకి తీసుకువచ్చి 3,500 సభ్యత్వాలను పూర్తి చేశామన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి



చలో విజయవాడకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన పెంచుకోవాలని విశ్వహిందూ పరిషత్ పెదగంట్యాడ శాఖ సభ్యుడు గొందేశి గురప్పరెడ్డి అన్నారు. జనవరి ఐదున ఐదున నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నెల్లిముక్కు రామాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చలో విజయవాడకు సంబంధించిన కరపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు వెంపాడ వెంకటరమణ, నీలాపు అప్పలస్వామి, ఎం.వెంకట్, జి.అప్పలనర్సమ్మ, గొందేశి హైమావతి, జి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

వేపగుంట, డిసెంబరు 10: స్థానిక కృష్ణానగర్‌లో ఉన్న అంతర్జాతీయ మానవ హక్కుల ప్రధాన కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఏపీ జనరల్ కార్యదర్శి జి.సత్యనారాయణ మాట్లాడుతూ హక్కుల సాధనకు ప్రతి ఒక్కరిలో చైతన్యం కల్పించేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి వాడకంతో అనర్థాలను యువతకు వివరించాలన్నారు. అనంతరం అంధ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాజాన ప్రసాదరావు, శ్రీనివాసరావు, విజయ, అజయ్‌కుమార్, లక్ష్మీనాయుడు, గణేష్ పాల్గొన్నారు.

ప్రారంభమైన గీతా జయంతి వేడుకలు

పెందుర్తిరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల అగ్రహారం గవరపాలెం కాలనీ శ్రీకృష్ణ గీతా మందిరంలో మంగళవారం గీతా జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో మూల విరాట్టుకు క్షీరాభిషేకం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి పూజలలో పాల్గొన్నారు. భక్త బృందం సభ్యులు గీతా పారాయణం, భజనలు చేశారు. ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేసింది.

ఆర్టీసీలో 19 మందికి కారుణ్య నియామకాలు

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో 19 మందికి కారుణ్య నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. ఇందులో 17మందిని కండక్టర్లుగా, ఇద్దరిని అసిస్టెంట్ మెకానిక్స్‌గా నియమించారు. రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు వీరికి నియామకపత్రాలు అందజేశారు. సర్వీసులో ఉండగా మృతిచెందిన వారి కుటుంబంలోని వారికి ఈ నియామకాలు చేపట్టారు. మరికొద్దిమందిని నియమించాల్సి ఉందని, త్వరలో వారికి కూడా నియామక పత్రాలు అందిస్తామన్నారు.

వెచ్చని నేస్తాలు

గడిచిన కొద్ది రోజుల నుంచి చలిపులి వణికిస్తోంది. బారెడు పొద్దెక్కినా మంచం దిగేందుకు జనానికి మనసొప్పడం లేదు. వెచ్చని రగ్గులో ముసుగుతన్ని నిద్రిస్తే ఆ సుఖమే వేరు. శీతాకాలంలో తప్పనిసరి ప్రయాణాలు, రోజువారీ విధులకు ఉదయాన్నే ఇళ్ల నుంచి బయలుదేరేవారి పరిస్థితి ఇబ్బందేకదా. ఆ ఇబ్బందుల్ని అధిగమించే చలి నేస్తాలు విశాఖ నగరంలోని పోలీస్ బ్యారెక్స్ వద్ద పలకరిస్తున్నాయి. ఒడిశా, మధ్యప్రదేశ్, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఉన్ని దుస్తులు తెచ్చి విక్రయిస్తుంటారు. రోజురోజుకూ చలి పెరుగుతుండటంతో ఉన్ని దుస్తుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే రాత్రి పూట ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. పగలంతా ఎండ ఉన్నప్పటికీ, సాయంత్రానికి వాతావరణం బాగా చల్లబడుతోంది. ఈ నేపథ్యంలో చలి నుంచి ఉపశమనం పొందడానికి విశాఖ, మధురవాడ తదితర ప్రాంతాల ప్రజలు ఉన్ని దుస్తుల కొనుగోలుకు ఎగబడుతున్నారు.

- డాబాగార్డెన్స్, ఆంధ్రజ్యోతి



పోలీస్‌బ్యారెక్స్ వద్ద స్వెట్టర్ల దుకాణంలో కొనుగోలుదారులు





వివిధ రకాల స్వెట్టర్లు

కొద్ది రోజులుగా పెరుగుతున్న చలి

- ఉన్ని దుస్తులకు డిమాండ్
- పోలీస్ బ్యారెక్స్ వద్ద ప్రత్యేక దుకాణాలు
- రూ.500 నుంచి రూ.1,800 వరకు ధరలు

ప్రత్యేక ఆకృతుల్లో..

ప్రస్తుత ఫ్యాషన్ ట్రెండ్‌ను అనుసరిస్తూ మహిళలు, పిల్లల కోసం వైవిధ్యమైన ఆకృతుల్లో ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. జర్కిన్‌లు, మఫ్లర్లు, క్యాప్‌లు, బ్లాంకెట్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఏటా వచ్చే స్వెట్టర్లపై ప్రజల్లో అంతగా ఆసక్తి ఉండటం లేదు. దీంతో మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త ఆకృతుల్లో స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, స్కార్ఫ్‌లు, మాస్కులు, జర్కిన్లు, చేతిగ్లోవ్స్, సాక్సులు, రగ్గులు, తదితర వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

చలిలో తిరిగేటప్పుడు రక్షణ తప్పనిసరి

చలిగాలి నుంచి రక్షణ పొందాలంటే కచ్చితంగా ఉన్ని దుస్తులు ధరించాల్సిందే. శరీరంలోని వేడి బయటకు వెళ్లకుండా ఉన్ని దుస్తులు వేసుకోకతప్పదు. రానున్న రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాత్రి, తెల్లవారుజామున రోడ్లపై ఎటువంటి రక్షణ లేకుండా తిరిగితే జలుబు, దగ్గు తదితర వ్యాధులకు గురవుతారని వైద్యులు హెచ్చరించారు. రాత్రి సమయంలో కొంత మంది ఉన్ని దుస్తులు ధరించి నిద్రపోతారు. అది అంత మంచిది కాదని వైద్యులు సూచించారు. చలిలో ఎక్కువగా తిరగవద్దని సలహా ఇచ్చారు. తప్పనిసరి పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తే స్వెట్టర్లు ధరించాలి. చెవుల్లోకి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వివిధ వెరైటీ డిజైన్లు అందుబాటులో..

- సోనే.. ఒడిశా



పలు ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చే వారికి వెరైటీ డిజైన్లు, మోడళ్లలో ఉన్న స్వెట్టర్లు, మంకీక్యాపులు, రగ్గులు స్కూల్, కాలేజీ విద్యార్థులకు, పెద్దలకు అప్పుడే పుట్టిన పిల్లలకు వేర్వేరుగా పలు రకాలు డిజైన్లు తీసుకొచ్చాం.ఏది చూసిన ఆకట్టుకుంది.ధరలు సైతం నామమాత్రంగానే ఉంటాయి.

సరసమైన ధరల్లోనే..

ఒడిశా నుంచి వచ్చే వ్యాపారులు ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేశారు. పిల్లలకు సంబంధించి స్వెట్టర్లు రూ.250 నుంచి రూ.700 వరకు, క్యాప్‌లు రూ.100 నుంచి రూ.250 వరకు పలురకాల డిజైన్లలో లభిస్తున్నాయి. ఆరేళ్ల నుంచి పదేళ్లలోపు పిల్లల స్వెట్టర్లు రూ.500 నుంచి రూ.1,800 వరకు లభిస్తుండగా, పదేళ్లకు పైబడిన వారి స్వెట్టర్లు రూ.350 నుంచి రూ.1,500 వరకు అందుబాటులో ఉన్నాయి. జర్కిన్ల డిజైన్లు నాణ్యతను బట్టి రూ.600 నుంచి రూ.1,800 వరకు ధరల్లో లభిస్తున్నాయి.

ఏడాదిలో మూడు నెలలు ఇక్కడే ఉంటాం..

- తషీ, ఒడిశా




ప్రతీ ఏటా మూడు నెలలకు పైగా ఇక్కడ ఉన్ని దుస్తులను అమ్ముతూ ఉపాధి పొందుతున్నాం. నవంబరు రెండో వారం నుంచి అమ్మకాలు ప్రారంభించాం. చలి తీవ్రత పెరుగుతదండటంతో వ్యాపారం రెండు రోజులుగా సాగుతుంది. అన్ని ప్రాంతాలకు నుంచి ఇక్కడకు వచ్చి వారికి నచ్చే డిజైన్లను తీసుకెళ్తుంటారు. ఏడాదిలో మూడు నెలల పాటుఇక్కడే ఉంటాం. చాలా మంది తెలుగులో మాట్లాడే నేపథ్యంలో నేను కూడా తెలుగునేర్చుకున్నా.

సరైన విద్యా విధానంతోనే సమాజ అభ్యున్నతి

- త్రిదండి చిన జీయర్ స్వామి

సీతమ్మధార, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజ అభ్యున్నతికి సక్రమమైన విద్యా విధానం ఉండాలని ఆధ్యాత్మిక ఆచార్యులు త్రిదండి చిన జీయర్ స్వామి అన్నారు. విద్యా విధానం గాడి తప్పితే ఫలితాలు వికృతంగానే వస్తాయన్నారు. సీతమ్మధార వర్మ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న గీతా జయంతి వేడుకల్లో మంగళవారం నాలుగో రోజు ఆరాధన, అనుగ్రహభాషణం అందించారు. సృష్టిలో వస్తువులన్నీ మంచివేనని, వాటి వినియోగం ద్వారా వస్తువు స్థితి మారుతుందన్నారు. భగవంతుడు మనకిచ్చిన వస్తువులను సక్రమంగా వినియోగించే సాధనను విద్య నేర్పుతుందన్నారు. వేదవిద్యలో కనీస అవగాహనకు 12 సంవత్సరాల సమయం పడుతుందన్నారు. సాధన, అధ్యయనానికి మరో ఎనిమిదేళ్లు అవసరమన్నారు. వేదవిద్యను సమాజానికి వినియోగించడానికి వేద పాఠశాలలు, ఆధ్యాత్మిక సంస్థలు ఉన్నాయన్నారు. శిశు జననాలు ప్రకృతి ధర్మం ప్రకారం ఉండేవని,నేడు శస్త్రచికిత్సల ద్వారా బిడ్డలకు జన్మనిస్తున్నారన్నారు. ప్రకృతి విరుద్ధంగా జన్మించిన శిశువులకు పూర్తిస్థాయి ధర్మాలు లభించే అవకాశం తక్కువన్నారు. అనంతరం మంత్రోపదేశం చేశారు. కార్యక్రమానికి సహకరించిన నిర్వాహకులను చిన జీయర్ స్వామి సన్మానించారు.



ప్రవచనమిస్తున్న త్రిదండి చిన జీయర్ స్వామి

కారు ఢీకొని యువకుడి మృతి

సీతంపేట, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న యువకుడ్ని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన గురుద్వార సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సీతంపేట గొల్లవీధికి చెందిన ఆబోతుల కనకరాజు (30) లైటింగ్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. గురుద్వార కూడలి వద్ద మంగళవారం మధ్యాహ్నం రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో కనకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ద్వారకా పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించి, సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. కారు డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు.



కనకరాజు మృతదేహం

భవనం పైనుంచి పడి వాచ్‌మన్ మృతి

సీతంపేట, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్‌హౌస్‌లో నిద్రిస్తున్న వాచ్‌మన్ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సీతంపేట కనకమ్మవారి వీధిలోని సూరిబాబు గ్రూప్‌హౌస్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న పొట్నూరు సూర్యనాయుడు (34), సోమవారం రాత్రి 11 గంటల సమయంలో భవనంపైన లిఫ్ట్ హౌస్‌లో నిద్రించాడు. మంగళవారం మెడపైకి వచ్చిన వారు సూరినాయుడు టెర్రస్‌పై మృతి చెంది ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ శ్రీనివాసరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.



సంఘటన స్థలం పరిశీలిస్తున్న పోలీసులు

యువకుడి ఆత్మహత్య

పెందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన ఆదివారం గవరజగ్గయ్యపాలెంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మక్బూరు (30) మద్యానికి బానిసై గ్రామంలో సోమరిగా తిరుగుతుండేవాడు. అప్పులు ఎక్కువవడంతో విసిగిపోయిన భార్య విడాకులు తీసుకుంది. ఊరు మారితే ప్రవర్తన మారుతుందేమోనని భావించి ఇతడి స్నేహితుడు మక్బూరును నగరానికి తీసుకొచ్చి గవరజగ్గయ్యపాలెంలో సోఫాలు తయారుచేసే దుకాణాలో పనికి కుదిర్చాడు. మద్యానికి పూర్తిగా బానిసైన అతడు చేతిలో డబ్బులు లేక, మద్యం మానలేక జీవితంపై విరక్తిచెంది ఆదివారం రాత్రి పనిచేస్తున్న ప్రదేశంలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలను లేఖలో రాశాడని ఎస్‌ఐ అసిరితాత తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

సీతంపేట, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని ద్వారకా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన ఎల్.దీపక్‌కుమార్ (22), సుబ్రహ్మణ్యం ఒడిశాలో గంజాయిని కొనుగోలుచేసి తమిళనాడుకు తరలిస్తున్నారు. ద్వారకా పోలీసులకు వారిని అదుపులో తీసుకుని, నాలుగు కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు వారిని రిమాండ్‌కి తరలించారు.

ఫిషింగ్ హార్బర్ అభివృద్ధిపై ఆర్డీవో సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హార్బర్‌లోని బీచింగ్ పాయింట్ వద్ద నాలుగు క్రెడిల్స్, క్రేన్ ఏర్పాటు చేస్తే బోట్లు మరమ్మతులకు అనుకూలంగా ఉంటుందని ఫిషింగ్ బోటు యజమానుల సంఘం అధ్యక్షుడు అన్నారు. ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులపై పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. హార్బర్‌లో లైటింగ్, మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. తిమ్మాపురం మహిళా ప్రతినిధులు రెండు చేపల రవాణా వాహనాలు మంజూరు చేయాలని, డ్రైఫిష్ యార్డులో వసతులు కల్పించాలని కోరారు. షెడ్స్ ఏర్పాటు చేయాలని ఫిష్ ట్రేడర్స్ కోరారు. జేడీ లక్ష్మణరావు, ఈఈ అరుణ్‌కుమార్, పోర్టు ఇంజినీరింగ్ అధికారులు, ఎం.లక్ష్మణరావు, సీహెచ్ వీర్రాజు, బి.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

'రింగువలలతో వేటను నిలిపివేయాలి'

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రింగు వలలతో చేపట వేట కూడదని లైసెన్సులు లేవని ఆర్డీవో హెచ్‌వీ జయరామ్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం మత్స్యకార ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏసీపీ నరసింహమూర్తి మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులకు కట్టుబడి ఉండాలని, చట్టాన్ని అతిక్రమించడం, తమ చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ మత్స్యకారులంతా సంయమనంతో వ్యవహరించాలన్నారు. కొత్తగా రింగువలలతో చేపల వేటకు అనుమతులు జారీ చేయమన్నారు. సమావేశంలో మత్స్యశాఖ, పోలీస్ అధికారులు, పెదజాలారిపేట, జాలారిఎండాడ, కొత్తజాలరిపేట, వాసవానిపాలెం మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.

25 మంది ఏఎస్‌ఐలు,హెడ్‌కానిస్టేబుళ్లకు బదిలీ

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, విభాగాల్లో పనిచేస్తున్న 25 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను అంతర్గత బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ఐదేళ్లకుపైగా ఒకేచోట పనిచేస్తుండడంతో బదిలీచేశారు. త్వరలో మరికొందరికి బదిలీ జరిగే అవకాశం ఉంది.

14న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటారు ప్రమాదాల నష్టపరిహారం కేసులు, ల్యాండ్ అక్విజేషన్, మనీరికవరీ, కార్మిక, పారిశ్రామిక వివాదాలు, కుటుంబ తగాదాలు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోటు ఢీకొట్టిన సంఘటనపై అధికారుల ఆరా

సాగర్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో మత్స్యకారుల బోటును ఢీకొట్టిన ఏపీటీడీసీ స్పీడుబోటును జిల్లా పర్యాటక శాఖాధికారిణి జ్ఞానవేణి మంగళవారం పరిశీలించారు. ప్రమాదానికి కారణాలను ఆరా తీశారు. బోటుకు ఏమేరకు నష్టం వాటిల్లిందీ తెలుసుకున్నారు. భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా చూసుకోవాలని, బోటుషికార్‌లో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి వినియోగదారుల హక్కుల వారోత్సవాలు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం ప్రచారాంశాలుగా ఈనెల 18 నుంచి 24 వరకు వారోత్సవాలు జరుగనున్నాయని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. వినియోగదారుల సంఘాల సహకారంతో హక్కులు, రక్షణ, బాధ్యతలపై అన్ని జిల్లాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యంపై కళాశాలలు, హైస్కూళ్లలో పోరసరఫరాలు, విద్యాశాఖల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని, వారోత్సవాల ముగింపు సందర్భంగా 24న అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

గొరపల్లిలో దారి దోపిడీ

- ఆటో డ్రైవర్‌ను చాకులతో బెదిరించి రూ.10వేలు తస్కరించిన ఆగంతకులు

పెందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి నుంచి సబ్బవరం వెళ్లే జాతీయ రహదారి గొరపల్లి అప్రోచ్ రోడ్డులో ఆటోను అటకాయించి, డ్రైవర్‌ను కత్తులతో బెదిరించి రూ.10వేలు దోచుకొన్న సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గొరపల్లికి చెందిన పల్లా జనార్దన జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో పంపు ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తన సొంత ఆటోలో మంగళవారం తెల్లవారుజామున విధులకు బయల్దేరాడు. ఆటో జాతీయ రహదారి సమీపానికి రాగానే రోడ్డు పక్కన పొదల్లోనుంచి ముగ్గురు వ్యక్తులు దూసుకొచ్చి అటకాయించారు. జనార్దనను చాకులతో బెదిరించారు. రెండు చేతులపై గాయపరిచారు. చొక్కా జేబులో రూ.10వేలను లాక్కొని పరారయ్యారు. ఎస్‌ఐ సూరిబాబు, క్లూస్ టీం సంఘటనా స్థలంలో వేలి ముద్రలను సేకరించారు. నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.



బాధితుడు జనార్దన్, సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిల్వ ఆహారం తిన్న గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

- మెగా పేరెంట్, టీచర్ మీట్‌లో మిగిలిపోయిన వంటకాలను మరుసటిరోజు వడ్డించిన సిబ్బంది
- వాంతులు, విరేచనాలతో ఎనిమిది మంది ఆస్పత్రిపాలు

పెదబయలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిల్వ ఆహారం తిని మినీ గురుకులం విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గోమంగి మినీ గురుకులంలో ఈనెల ఏడో తేదీన మెగా పేరెంట్-టీచర్ మీట్ నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం వంటలు చేయించారు. అవి మిగిలిపోవడంతో ఆదివారం విద్యార్థినులకు టిఫిన్‌తో పాటు నిల్వ ఉన్న కోడి కూరను వడ్డించారు. అది తిన్న ఎనిమిది మందికి సోమవారం వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. సిబ్బంది వారిని పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. నిల్వ ఆహారం తినడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారు ఆరోగ్యంగానే ఉన్నారని డాక్టర్ చైతన్య తెలిపారు. దీనిపై గురుకులం ప్రత్యేక అధికారి పి.వసంత వివరణ కోరగా, మెగా పేరెంట్-టీచర్ మీట్‌కు ఆశించిన స్థాయిలో విద్యార్థినుల తల్లిదండ్రులు రాకపోవడంతో ఆహార పదార్థాలు మిగిలిపోయిన విషయం వాస్తవమేనని వాటి ని బయట పడేయాలని సిబ్బందికి చెప్పాన న్నారు. సోమవారం ఉదయం టిఫిన్ తయారు చేయించి, బాధ్యతలను వేరొకరికి అప్పగించి శిక్షణ నిమిత్తం విజయనగరం వెళ్లానన్నారు. నిల్వ ఆహారం వడ్డించినట్టు తనకు ఆలస్యంగా తెలిసిందన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ ద్వారా తెలుసు కున్నట్టు చెప్పారు.



గోమంగి పీహెచ్‌సీలో సోమవారం చికిత్స పొందుతున్న విద్యార్థినులు